
( సిల్హౌట్‌లో మనిషి జంతువును వేటాడుతున్నాడు. )

ప్రయోక్త: క్రీస్తు పూర్వం యాభై వేల సంవత్సరాల క్రితం మనిషిని మనిషి పీక్కుతినేవాడు. అందుకోసం రాతిని గదలా ఆయుధంగా ఉపయోగించేవాడు. కాలం గడుస్తున్న కొద్దీ మనిషి నాగరికంగా మారిపోయాడు. రాతి గదలను ఉపయోగించడానికి వీల్లేని నాగరక ప్రపంచంలో సాటి మనిషిని తినడానికి కొత్త కొత్త ఆయుధాలు కావలసి వచ్చాయి. తన తెలివి తేటలతో ఒక పెద్ద యంత్రాన్నీ యంత్రాంగాన్నీ సృష్టించాడు. ఆవ్యవస్థలో రంపాలకన్నా వేగంగా కట్టుబాట్లు మనిషిని పీక్కుతింటాయి.

# ముష్టియుద్ధం

నాటిక



## యండమూరి వీరేంద్రనాథ్

మరల కన్నా వేగంగా రక్తాన్ని పిండుతాయి. అయితే, తెలివైన మనిషి సృష్టించిన ఈ రక్త తర్పణపు యజ్ఞంలో బలులూ, చావులూ కూడా చాలా నాజూగ్గా నిర్వహింప బడతాయి. చంపబడుతున్న వాడు తను ఎలా చంపబడుతున్నాడో కూడా తెలుసుకోకుండా ఈ హోమం జరుగుతూ ఉంది. తన స్థానాన్ని పరిరక్షించుకోవడానికి, తను అంచె లంచెలుగా పైకి పోవడానికి తెలివైన వాడు నిర్మించుకున్న యంత్రాలలో ఒకటి—

( లైట్స్ ఆఫ్ )

బాంక్.

( కౌంటర్లో అనిల్‌కుమార్ కనబడని కస్టమర్లకి కాష్ ఇస్తున్నాడు. ప్యూన్ టోకన్లు ఇస్తున్నాడు. "బాంక్ ఆఫ్ ఉటోపియా" అన్న బోర్డు వేలాడుతూంది. బల్ల మీద ఒక వ్యక్తి నిద్ర పోతున్నాడు ( విజిటరు).

ప్రయోక్త: బాగా డబ్బున్న అజీర్తి రోగి తన డబ్బుని భద్రంగా దాచుకోవడానికి ఇది ఇనప్పెట్టె. ఎంత తిన్నా అరగని ఆకలి రోగి తన పంచభక్ష్యపరమాన్నాలు వండుకోవడానికి ఇది ప్రొవిజన్ స్టోర్సు. డబ్బున్న వాడికీ, డబ్బు ఇంకా కావాల్సిన వాడికీ మధ్య వంతెన ఇది. ఈ వంతెన కడుతూన్న కార్మికుడు సామాన్యుడు, ( లైట్స్ ఆఫ్ )

( బాంకి మీద చీకటి. ప్రయోక్త మీద స్పాట్. )

ప్రయోక్త: నేను ఈ దేశపు సగటు మనిషిని! డబ్బున్న వాడికి దోహదం చేసే ఈ యంత్రాంగంలో నేనూ ఒక బోల్టుని. నా తెలివి తేటల్ని ఈ యంత్రాలు నడవడానికి ఉపయోగిస్తాను. మా వాళ్ళకు మరింత డబ్బు సంపాదించి పెడతాను. ( ఆగి ) నాకు తిండి—నా కుటుంబానికి రక్షణ ముఖ్యం. ఈ వ్యవస్థ నాకు దాన్ని కల్పిస్తుంది. అందుకని మే మందరం వీళ్ళతో చేరిపోయాం. మా తెలివి తేటల్ని. . . "దోచుకోవటంలో కొత్త పద్ధతులు" ఆలోచించడం కోసం ఉపయోగిస్తున్నాం. కానీ, ఒక రోజు వస్తుంది. మోసగింపబడే వాడు తనెంత తెలివిగా మోసగింప బడుతున్నాడో తెలుసుకొని ఒక దివిటీ వెలిగించిననాడు ఆ రోజు అగ్ని పర్వతం బ్రద్దలవుతుంది. ఆ అగ్ని మా మనస్సులను ప్రక్షాళనం చేస్తుంది. అంతవరకూ...

( బెల్ మోగింది )

క్షమించాలి. మా ఎమ్. డి. పిలుస్తున్నారు. వస్తున్నా, సార్. ( అంటూ లోపలికి వెళ్ళాడు. స్టేజి ఇప్పుడు పూర్తిగా ప్రకాశవంతమైంది. కాష్ కౌంటర్ మీద కాళ్ళు పెట్టుకుని అనిల్‌కుమార్ రేడియో వింటున్నాడు. పీతాంబరం లేడు. )

( రేడియో రాక—అనిల్ ప్యూన్‌తో )

అనిల్‌కుమార్: ఏమిటేది—కామెంటరీ రావటం లేదు. టైమెంతయిందోయ్?

ప్యూను: వాచీ కొనుక్కో రాదయ్యా.

అనిల్‌కుమార్: ఎల్. ఐ. సి. ల్లోనూ, బాంకుల్లోనూ ప్యూన్లకే ఉంటాయోయ్ ఎలక్ట్రానిక్ వాచీలు. క్లర్కులకి, ఆఫీసర్లకి ఉండవ్. టైమెంతయింది?

ప్యూను: నైన్ ఫార్టీఫైవ్.

అనిల్‌కుమార్: నైన్ ఫార్టీఫైవ్ ( అని అరిచి ) మరింకా కామెంటరీ రాదేం? ఏమోయ్, వర్షం గానీ వస్తూందంటావా?

ప్యూను: ఆ ముష్టోడు అడ్నే ఉన్నాడు గదయ్యా. అంటే వాన వస్తల్లేదు అన్న మాటే.

అనిల్‌కుమార్: ఇక్కడ కాదోయ్. బాంబే—బాంబేలో.

ప్యూను: అక్కడ సంగతి నాకు తెలవదు.

అనిల్‌కుమార్: ఇక్కడ సంగతికూడా నీకుతెలీదు. వర్షం పడినా, పిడుగులు పడినా ఆ కుష్ఠువాడు అలా బాంకు ముందుంటాడనే కదా వాడికి బాంకు ముష్టి అని మన వాళ్ళు పేరు పెట్టింది. మా బి.కామ్. ఎకనమిక్సులో—( పెద్ద శబ్దంతో కామెంటరీ ప్రారంభమవుతుంది. )

అనిల్‌కుమార్: ( గెంతి ) వచ్చేసింది. ( ప్యూన్‌తో ) ఇండియా ఈజ్ బ్యాటింగ్, గవాస్కర్. గవాస్కర్ ఈజ్ గోయింగ్ టు బ్యాట్. బౌలింగ్ ఎవరు? థామ్సనా, లిల్లీయా. ( ప్యూన్‌తో ) థామ్సన్. థామ్సన్ కమింగ్ టు బౌల్ రైటార్మ్ ఓవర్ ది వికెట్. ఫస్ట్ బాల్ ఆఫ్ ది మ్యాచ్ అండ్—అండ్—హి ఈజ బౌల్డ్. గవాస్కర్ ఈజ బౌల్డ్. ( అని బల్లని కొట్టడంతో కాగితాలు గాలిలోకి ఎగుర్తాయి )

పీతాంబరం: ( వస్తూ ) ఏమిటయ్యా బాంకులో ఫ్లయింగ్ సాసర్లు ఎగురుతున్నాయి.

అనిల్‌కుమార్: అది—అది కల్పన గారిదండీ.

పీతాంబరం: ( నెమ్మదిగా దగ్గర కొచ్చి ) కల్పన గారి డ్రాయరు నువ్వెప్పట్నుంచీ ఓపెన్ చేస్తున్నావోయ్.

అనిల్‌కుమార్: అది—ఆ డూప్లికేట్ కోసం—

పీతాంబరం: ఆవిడ డూప్లికేట్ ఏ కెందు కబ్బా?
అనిల్ కుమార్: అది కాష్ కౌంటరూ—కాష్షూ—డ్రాయరూ.
పీతాంబరం: ( ఈ లోపులో రేడియో చూసి ) ఆఫీసులో ఏమిటోయ్ ఇది? న్యూసెన్సు.
అనిల్ కుమార్: అదీ... అదీ.
ప్యూను: క్రికెట్ ఆడేటోళ్ళకి ఇంక్రిమెంట్లిచ్చినారు కాదయ్యా! గట్లనే ఇనేటోళ్ళకి కూడా ఇస్తరేమోనని ఇంటన్నడు.
పీతాంబరం: ఊఁ. గోటీ బిళ్ళ ఆడతాను. ప్రమోషన్ ఇమ్మన్లే.
అనిల్ కుమార్ : దేశ ప్రగతి నిరోధానికి సంబంధించినంత వరకూ క్రికెట్టయినా, గోటీబిళ్ళయినా ఒకటే కద్సార్. మా బి. కామ్. ఎకనమిక్స్‌లో...
ప్యూను : రేపు యూనియన్ మీటింగ్‌లో పెట్టించాలె. గోటీబిళ్ళ ఆడేటోళ్ళ క్కూడ ప్రమోషన్లియ్యాలని— ప్రతి రోజూ పన్నెండింటికే ఆటగాళ్ళని ఆఫీసొదిలెయ్యాలని. ( ఇంకా ఆవేశంగా చెప్పబోతూ ఉంటే బెల్ వినిపిస్తుంది. ) వస్తన్నా, దొర.
అనిల్ కుమార్ : ఎమ్. డి. గారు లోపలే ఉన్నారా?
పీతాంబరం : ఊఁ— ఉన్నారు.
అనిల్ కుమార్ : అన్నీ వినేసేరా — కల్పన గారి డ్రాయరు — గవాస్కర్ బౌల్డు— అన్నీ వినేశారా? నాయనోయ్, నా ప్రమోషన్ — నా కాన్ఫిడెన్షియల్ రిపోర్టు.
ప్యూను :( వచ్చి ) ఎమ్. డి. మన జనరల్ లెడ్జరు అడుగుతున్నారు.
పీతాంబరం : జనరల్ లెడ్జరా —
అనిల్ కుమార్ : జనరల్ లెడ్జర్ — జనరల్ లెడ్జర్ — ( అని వెతకటం మొదలు పెడతాడు. )
పీతాంబరం : నిన్న సాయంత్రం లోపల పెట్టలేదా?
అనిల్ కుమార్ : టేబిల్ టెన్నిస్ నెట్ చిరిగిపోయింది, సార్. దాన్నే నెట్‌గా పెట్టుకొని ఆడేం ( అని నటించి చూపిస్తాడు. )
పీతాంబరం : లెడ్జర్ పుస్తకాన్ని నెట్‌గా పెట్టుకొని ఆడేరా? మిమ్మల్ని తగలెయ్య. తర్వాత తీసి లోపల పెట్టలేదా?
అనిల్ కుమార్ : పెట్టమని చెప్పాను, సార్. ఆఫీసు టైమయిపోయింది కాబట్టి పుస్తకం లోపల పెట్టటానికి ఓవర్ టైమ్ కావా అన్నాడు ( ప్యూన్ని చూపించి.)
పీతాంబరం : ఈ బాంకు ఇక బాగుపడదు.
(అని లోపలికి వెళ్ళాడు. మిగతా ఇద్దరూ వెతికేస్తుంటారు. ఈ లోపులో బయట నుంచి మోచోడు వచ్చాడు. ''బాబూ, అయ్యా'' అంటూ ఇద్దర్నీ అడుగుతున్నాడు. వాడిని ఎవరూ పట్టించుకోవడం లేదు. వాడిని కూడా వెతికేశాడు ప్యూను. ఒంగొని బల్ల కింద బోర్లా పడుకొని వెతుకుతున్నాడు.
అనిల్ కుమార్ :( ప్యూను పడుకొని ఉండడం చూసి ) అదేమీ ఉగ్గుగిన్నె కాదయ్యా— లెడ్జర్ — బౌండ్ — బౌండ్ బుక్.
మోచోడు : దండాల్దొరా.
అనిల్ కుమార్ : ఏమోయ్ — నీకేం కావాలి? ( తన సీటు దగ్గర కెళ్తాడు)
మోచోడు : చెరువెనకాల పొలెంలో పెద్ద రావి సెట్టుకాడ సెప్పులు కుట్టుకునే టోణ్ణి, దొర. మా తాత — మా నాయిన— అందరం అడ్నే బ్రతుకు ఎల్లబుచ్చినం. (ఆగి) నాతోబాటు నా తరంలో రావిసెట్టూ ముసల్దై పోయింది. ఇయ్యాల్ రేపో దాన్ని సర్కారోళ్ళు కొట్టించేస్తారంట.
అనిల్ కుమార్ : అయితే, మమ్మల్నేం చేయమంటావోయ్?
మోచోడు : నాలుగు తాటాకులు తీసుకొని కొట్టు పెట్టుకుంట. డబ్బు లిప్పించు.
అనిల్ కుమార్ : తాటాకు కొట్టుకి డబ్బులా!
మోచోడు : అదే, బాబూ— ఈడ అప్పిస్తారంట గదా!
అనిల్ కుమార్ : అప్పా?! హోటల్స్, సినిమా హాళ్ళూ కట్టుకోవడానికిస్తాంగానీ— అప్పు — తాటాకు పాక లేసుకోవడానికివ్వం. వెళ్ళెళ్ళు.
మోచోడు : అంతమాటనకు, బాబూ. ముసల్దైనదని రావిసెట్టు నైతే కొట్టేస్తన్నరు గాని — ముసలోన్నైనానని మడిసిని పేణాలు దీస్కోలేరు గద. ఎంతో వొద్దు, బాబయ్యా—అయిదొందలు—ఒక్కయిదొందలు సాలు, బాబు — నీ పేరు సెప్పుక బతుకుత—
అనిల్ కుమార్ : బతుకుతూ అప్పు దీరుస్తే సర్లేదు.
ప్యూను : సస్తే ముసలోని కప్పిచ్చినందుకు ఈయ నుద్యోగం పోద్ది.
అనిల్ కుమార్ : అప్పుడు నువ్వు ఖాళీ చేసిన పాకలో నేను చెప్పుల దుకాణం పెట్టుకోవాలి.
మోచోడు : అంతమాటెందుకులే, బాబూ. సెప్పులు కుట్టుకునే నే నేడ— బంగారం లాంటి బాంకులో పన్జేసే నువ్వేడ. నీ ఎడంకాలి సెప్పులాటోడ్ని.
ప్యూను : పెమోసన్ రైట్నా మేంగూడ గీ బ్యాంకల ఎమ్. డి. గారి సెప్పులు బంగారంలా కళ్ళకద్దుకుంటాం.
అనిల్ కుమార్ : చెప్పుల మీద జెనరల్లైజేషన్ చాలుగానీ — జనరల్ లెడ్జర్ ఎక్కడుందో చూడు.
ప్యూను : (ఆవేశంతో) బాంకు సొమ్ముని బద్రంగ సూస్కొనే బాధ్యత ఆఫీసర్లదని యూనియన్ అగ్రిమెంట్లనే ఉంది. ఇయ్యాల గాని ఆ పుస్తకం కనబడకుంటే మల్ల దాని బాధ్యత పీతాంబర మయ్యదే. ఆయనకే మెమొ ఇయ్యాలె. గంతెగానీ — గంతె గానీ నెలకు ఏడెనిమి దొందలు మాత్రమే జీతం దీస్కొనే మాలాటి ప్యూన్లకీ—క్లర్కులకీ పుస్తకాలు సరిగ్గ సూస్కొనే టంత పెద్ద పెద్ద పన్ల సెప్పొద్దు. ఇయ్యాలగా పుస్తకం పోయిందంటే— (పీతాంబరం రావడం చూసి) పోయిందంటే గెట్టైతది? పేనం పోసన్న ఎతుకుతాం. అంతేగాని, అయ్యకు మాటొచ్చేటట్ల జేస్తం?

పాత్రలు :

**కుష్ఠువాడు**

**మోచోడు (చెప్పులు కుట్టేవాడు)**

**అనిల్ కుమార్**

**లాయరు పంతులు**


**పీతాంబరం/ప్రయోక్త (వేర్వేరు దుస్తుల్లో)**

**ప్యూను**

అనిల్ కుమార్ : చెయ్యం.
పీతాంబరం : ఏమీ చెయ్యక్కర్లేదు. పుస్తకం ఎమ్. డి. గారే తీసి ఉంచేర్ట మనకి బుద్ధి రావాలని. ( మోచోడుని చూసి ) ఇతనికేం కావాలి?
అనిల్ కుమార్ : బాంకులోకి ఎవడైనా ఎందుకొస్తాడు, సార్. మా బి. కామ్. ఎకనమిక్సులో చెప్పినట్టు అయితే డబ్బు దాచుకోవడానికి, లేకపోతే డబ్బు తీసుకోవడానికి వీడికి అప్పు కావాలిట.
మోచోడు : అవును, బాబయ్యా. సిన్న సెప్పుల కొట్టు పెట్టుకుంటా. అయిదొంద లిప్పించు.
పీతాంబరం: ఇతడిని ఇంటర్వ్యూ చేసి, అప్లికేషను పూర్తిచేసి పంపు.
అనిల్ కుమార్ : రాలిపోతున్న పండుటాకు లాంటి వాడు, సార్. అప్పిస్తే మనం మునిగిపోతాం.
పీతాంబరం : నిర్ణయాలు తీసుకునేది నువ్వు కాదు. నేను! ఒక లెడ్జరు పుస్తకాన్ని భద్రపరిచే బాధ్యత కూడా తీసుకోని నీకు, బాధ్యతని రూల్సుతో ప్రతి క్షణం కంపేర్ చేసుకుంటున్న నీకు — ఇలాంటి నిర్ణయాలు తీసుకునే హక్కు లేదు. ఇతడితో మాట్లాడి అప్లికేషను పంపించు.
(అని తన సీటు దగ్గరికి కెళ్తాడు. )
అనిల్ కుమార్: (అటు చూసి తల ఎగరేసి) ఫారం ఒకటియ్యి— ( ప్యూను లోపలి కెళ్తాడు ) నీ పేరు? ( రాసుకుంటూ. )

మోచోడు : మోచోడు.

అనిల్‌కుమార్ : వృత్తికాదు—పేరు.
మోచోడు : ఓబలేసు.
అనిల్‌కుమార్ : షెడ్యూల్ కాస్టా — షెడ్యూల్ ట్రైబా?
మోచోడు : అంటే!
అనిల్‌కుమార్ : నువ్వు షెడ్యూల్ కాస్టో — షెడ్యూల్ ట్రైబో నీకే తెలియాదన్న మాట.
మోచోడు : నాకు సెప్పులు కుట్టడం తెల్సు, బాబు. యాభై ఏళ్ళ నుంచీ కుట్టూనే ఉన్న.
అనిల్‌కుమార్ : అయితే షెడ్యూల్ కాస్టన్న మాట. (రాసుకుంటాడు) సెక్యూరిటీ ఏమిస్తావ్?
మోచోడు : అంటే ఏంది, బాబు?
అనిల్ కుమార్ : అంటే తాకట్టు—ఏ ఆస్తి తాకట్టు పెడ్తావ్?
మోచోడు: ఆయనే ఉంటే మంగలోడు ఎందుకు, బాబూ.
అనిల్ కుమార్ : అయితే ఏ ఆస్తీ లేదు.
మోచోడు : లేదు, బాబూ.
అనిల్ కుమార్ : వయస్సు అరవై సంవత్సరాలు.
మోచోడు : అవును, బాబూ. 50 ఏళ్ళనుంచీ కుట్టూనే ఉన్నా. ఈ సేతులు సూడు. కుట్టీ కుట్టీ మేకుల్లాగయినయ్.
అనిల్ కుమార్ : అయినా ఆస్తి సంపాదించుకోలేదు.
మోచోడు : సెప్పులు కుడితే ఏ మొస్తదయ్యా. అమ్మితే వస్తుంది. నా దగ్గర సెప్పులు కొని బజార్లో అమ్మినోడు అదే బజార్లో ఇళ్ళు గట్టినాడు.
అనిల్ కుమార్: మరి నువ్వూ శుభ్రంగా చెప్పులు కొని అమ్ముకోకూడదోయ్. అలా ఎండలో పడి కుట్టట మెందుకు ?
మోచోడు: అందరూ అమ్మే వాళ్ళయితే కుట్టేవాళ్ళెవరు, బాబూ?
అనిల్ కుమార్: అవునవునుకదూ. మా బి. కామ్. ఎకనమిక్సులో చెప్పినట్టూ అమ్మకం కన్నా ముందు ప్రొడక్షన్ ఉండాలి. అయితే, ఆ చెప్పులు నువ్వే కుట్టి నువ్వే అమ్ముచ్చుకదోయ్. సో దట్ లాండ్, లేబర్, కేపిటల్ ఆర్గనైజేషన్ ఒకచోట ఉంటాయి. అన్నీ నీకే మిగులుతాయి— రెంటు, ఇంటరెస్టు, వేజెస్, ప్రాఫిట్సు.
మోచోడు : తెలుగులో సెప్పు, బాబూ.
అనిల్ కుమార్ : నువ్వు కుట్టిన చెప్పులు—ఎలా చెప్పాలి నీ కర్థమయ్యేటట్టూ— ఆఁ—నువ్వు కుట్టిన చెప్పులు దళారీలు లేకుండా నిన్నే అమ్ముకోమంటున్నానోయ్.
మోచోడు : దానికి సాన డబ్బులు కావాలయ్యా. కుట్టిన సెప్పులు కష్టమరొచ్చే వరకూ దాయాల. సో కేసులో పెట్టాల.
అనిల్ కుమార్ : దానికేగా బాంకులున్నాయి. పెట్టుబడిదారి వ్యవస్థలో దేశ ప్రగతికి పెట్టుబడి అనే దాని అవసరం గుర్తించి, అప్పు లివ్వడంకోసం బాంకుల్ని పెట్టింది ప్రభుత్వం. బాంకు అప్పు ఇస్తుంది. ఆ డబ్బుతో నీవు పరిశ్రమ స్థాపించొచ్చు. నీ కింద పదిమంది పనివాళ్ళను పెట్టుకోవచ్చు. నీకున్న యాభై ఏళ్ళ అనుభవంతో మరింత ఉత్పత్తి పెంచొచ్చు.
మోచోడు: (ఆనందంగా—తొందర తొందరగా) సాన బాగా సెప్పినవ్, బాబు— అందుకే వచ్చినా. అప్పు ఇప్పించు. నీ కాళ్ళకి దండం పెడ్త.
అనిల్ కుమార్ : (తడబడి) ఆహాఁ—అది థియరీ (ఆలోచించి) మరి మేం కొంత ఇస్తే—నువ్వు కొంత పెట్టాలి కదా. నీ దగ్గ రెంతుంది?
మోచోడు : వణికే వేళ్ళలో కుట్టే బలం తప్ప ఇంకేం లేదయ్యా. రోజు రోజుకి ఇదీ తగ్గిపోతుంది.
అనిల్ కుమార్ : నీ దగ్గర నయాపైస పెట్టుబడి లేకుండా మమ్మల్ని అప్పియ్యమంటే ఎలాగయ్యా. పోనీ నీ అప్పుకి గారంటీ ఎవరైనా ఉంటారా?
మోచోడు : ఆఁ—నా చెప్పులు గారంటీగా మన్నుతాయి. బాబూ.
అనిల్ కుమార్ : చెప్పులు గారంటీ కాదయ్యా. గారంటీ—హామీ—హామీ ఎవరైనా ఇస్తారా?
మోచోడు: నా కెవరున్నారు, బాబూ—కొడుకు తప్ప—
(ప్ర్యూను ఫారం తెచ్చి పెట్టాడు.)
అనిల్ కుమార్ : ప్చ్ ఇక్కడ సంతకం పెట్టు.
మోచోడు : రాదు, బాబూ—ఏలి ముద్రే.
అనిల్ కుమార్ : అదే వెయ్యి (వేయించుకొని—పీతాంబరం దగ్గరకు తీసుకెళ్ళి) ఇదిగోండి, సార్, ఫారం, నా రిపోర్టు.
పీతాంబరం : ఏమిటి నీ రిపోర్టు?
అనిల్ కుమార్ : (చదువుతూ) దరఖాస్తుదారు వెనకబడిన జాతివాడు. యాభై సంవత్సరాల అనుభవం ఉంది. కాని కేపిటల్ చిల్లికాణీ పెట్టలేడు. ఆస్తి నయాపైసా తాకట్టు పెట్టలేడు. కనీసం అణాకాణీ గారంటీ ఇచ్చేవాడు కూడా లేడు. కాబట్టి అప్పు ఇవ్వడానికి అనర్హుడు.
మోచోడు : అంతమాటనకు, బాబూ. అప్పిప్పించండి. మీ ఋణం ఉంచుకోను. సానా కష్టాల్లో ఉన్నాను. నించోడానికి నీడకూడా ఉండదు, బాబు.
పీతాంబరం : (అప్లికేషన్ చూస్తూ) నీ తరపున ఎవరూ లేరా?
మోచోడు : నేనూ—నా కొడుకూ—ఇద్దరమే, బాబయ్యా.
పీతాంబరం : నీ కొడుకున్నాడా? ఏం చేస్తున్నాడు?
మోచోడు : మొన్నే సదువు పూర్తయిందండీ.
పీతాంబరం : ఏం చదువు?
మోచోడు : బియ్యే, బాబూ.




అనిల్ కుమార్ : వాట్! (అరిచేడు)
పీతాంబరం : ఏం, చెప్పులు కుట్టేవాడి కొడుకు గ్రాడ్యుయేట్ ఎట్లా అయ్యాడని ఆశ్చర్యంగా ఉందా? దేశం నువ్వనుకున్నంత హీనస్థితికి దిగజారటం లేదోయ్. ఇంకా తొందరగా ముందు కెళ్తుంది—నీలాంటి వాళ్ళు అడ్డ పడకపోతే.,.
అనిల్ కుమార్ : నేనేం చేశాను, సార్, మధ్యలో—
పీతాంబరం : నీ కొడుకు ఖాళీగానే ఉన్నాడా?
మోచోడు : ఉన్నాడయ్యా. ఏడాదినుంచీ ఉద్యోగనే దొంకలే.
పీతాంబరం : నీతోపాటు కూర్చుంటాడా?
మోచోడు : ఎందుగూ పోడు, బాబూ.
పీతాంబరం : (అనిల్‌తో) అలా అడిగుండాల్సింది. అప్పుడు అన్‌ఎంప్లాయిడ్ గ్రాడ్యుయేట్ స్కీమ్ క్రింద ప్రభుత్వం రెండొందలిచ్చి ఉండేది. యస్సీ కార్పొరేషను రెండొందలూ, మనం ఏడొందలూ ఇస్తే, వెయ్యితో వాడికో షాపు తయారవుతుంది. దేనికైనా పాజిటివ్ అప్రోచ్ ఉండాలయ్యా. (వ్రాస్తూ) నీ కేడొందలు అప్పు మంజూరు చేస్తున్నాను. నెల కేభై చొప్పున తీర్చాలి. మిగతా సంతకాలు అతను పెట్టేస్తాడు వెళ్ళు.

ప్యూను : రావోయ్. (వెళ్తాడు)
పీతాంబరం : నువ్వూ, నీ కొడుకూ జాగ్రత్తగా చూసుకోవాలి షావుని. (నవ్వుతూ) మీ అప్పు ఎగ్గొడితే నాకు మాటొస్తుంది.
మోచోడు : మా ఇంట్లో దీపం వెలిగించావ్, బాబూ. నా కంట్లో ఎలుగున్నంతవరకూ దాన్ని ఆరనివ్వను. నా సెర్మం ఒలిచైనా సరే—నా నరాల్ని సెమటలో నానబెట్టయినా సరే, సెప్పులు కుట్టి ఈ అప్పు దీరుస్తా, బాబూ. అంతేగాని, అంతే గానీ—నీకు మాట రానివ్వను, బాబూ. మాట రానివ్వను.

(బయటికి వెళ్ళిపోతాడు)

పీతాంబరం : అనిల్ కుమార్—
అనిల్ కుమార్ : సర్.
పీతాంబరం : లోన్స్ సెక్షన్‌లో ఇంతకాలం అనుభవం పొందేవ్. కాష్‌లో కొంతకాలం కూర్చోవోయ్.
అనిల్ కుమార్ : అబ్బే. వద్దు, సార్.
పీతాంబరం : ఏం? పై రాబడి పోద్దనా—
అనిల్ కుమార్ : అబ్బెబ్బె, నేను నీచు ముట్టను, సార్.
పీతాంబరం : మరి కాష్‌లో కూర్చోవటానికేం?




అనిల్ కుమార్ : అంటే, అదీ—అదీ—
పీతాంబరం : చూడు—బాంక్‌కి అప్పు లివ్వడం ఎంత ముఖ్యమో, డిపాజిట్‌లు తీసుకోవడం కూడా అంతే ముఖ్యం. రెండూ రెండు కళ్ళు. ఏం మొహమాట పడక కాష్‌లో కూర్చో. పరిస్థితులు అర్థం చేసుకునేవాడు లోన్స్‌లో ఉంటే బాగుంటుందని నా ఉద్దేశం. ఏం?
అనిల్ కుమార్ : సరే, సార్ (అని కాష్‌వైపు వెళ్తూ—స్టిల్ )
పీతాంబరం : (ప్రయోక్తగా) అతను ఏం అనుకుంటున్నాడో నాకు తెలుసు. ''పరిస్థితులు నీకుమాత్రం ఏం తెలుసురా, ఫూల్. వాస్తవంలో బతక్క పోతే, ఐడియలిజంతో తల బొప్పి కడ్తుంది'' అని అనుకుంటున్నాడు. (లైట్స్ ఆఫ్ ) (ప్రయోక్త మీద స్పాట్. అనిల్‌కుమార్ కదలి కాష్ కౌంటర్ దగ్గిరకెళ్ళి కూచున్నాడు.)—
ప్రయోక్త : వాస్తవం చాలా భయంకరమైనది. దాన్ని అర్థం చేసుకోవడం కష్టం. దయచేసి మీరు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. చెప్పులు కుట్టుకునేవాడికి ఏడొందలు అప్పిచ్చి మూడొందలు వడ్డీకింద వసూలు చేస్తాం మేము. అదే ఏడొందలు మా బాంక్‌లో డిపాజిట్ చేసేవాడికి రెండొందలే వడ్డీ ఇస్తాం. మిగతా వందా మాకు. ఈ వందే వేలు, లక్షలు, కోట్లు అవుతుంది. ప్రతి వీధికీ నాల్గయిదు బాంకుల్ని తయారు చేస్తుంది. అంతస్తుల మీద అంతస్తులున్న బిల్డింగులు కట్టిస్తుంది. బిల్డింగులకు ఎయిర్—కండిషనర్‌లు పెట్టిస్తుంది. ఇంకా జీతాలు చాల్లేదని స్ట్రైకులు చేయిస్తుంది.

డబ్బు కోసం మేమెంత కక్కుర్తి అయినా పడతాం. డిపాజిటర్ మోచేతి నీళ్ళయినా తాగుతాం. అదిగో—అతన్ని చూడండి.

(బ్రీఫ్‌కేస్‌తో ఒకరు కాష్ ఇస్తున్నారు. కోటు, హాటులతో ఉన్నాడు ) అతడు బాలా షూ కంపెనీ ప్రొప్రైటరు. గవర్నమెంటు డిపాజిట్లు అయిదు లక్షలు ఇప్పించాడు. అందుకే అతడంటే మాకు భక్తి. అయితే అతడు చాలా తెలివైన వాడు. డిపాజిట్ల పేరు చెప్పి మా దగ్గర యాభై లక్షలు అప్పు తీసుకున్నాడు. తన తోళ్ళ వ్యాపారం పెంచి పెద్ద చేస్తున్నాడు. రాజులు సామ్రాజ్యాలు కొల్లగొట్టినట్లు తన మార్కెట్టును దేశమంతా నెమ్మదిగా నెమ్మది నెమ్మదిగా విస్తరింప చేస్తున్నాడు. అతడు మరింత సంపాదించాలి. మరింత గడించాలి. మరింత మా బాంక్‌లో దాచుకోవాలి. మా బాంక్ బిల్డింగ్ అంతస్తు మరొకటి పెరగాలి. అందుకే—

ఉయ్ లవ్ డిపాజిటర్స్. కష్టమర్ల సేవయే మా కర్తవ్యం. ( లైట్లు వెలిగాయి ).

(అనిల్ వేరే డ్రెస్‌లో ఉంటాడు ).

అనిల్‌కుమార్—పదహారు టోకెన్ నంబరు పదహారు,.. (ఆగి ) టోకెన్ తీసుకొని కాఫీ కెళ్ళినట్లున్నా డాయన. ( పీతాంబరంతో ) కాష్‌లో చిల్లర తక్కువైంది, సార్.
పీతాంబరం: ఇప్పుడా చెప్పేది? పొద్దున్నించి ఏం చేశావోయ్?
అనిల్‌కుమార్: అందరూ చిల్లరే అడుగుతున్నారు, సార్, వంద నోట్లు ముందు ముందు చెల్లవేమోనని భయం అనుకుంటూ.
పీతాంబరం: కాయిన్స్ తక్కువైనాయా? వన్ రుపీ నోట్సా?
అనిల్‌కుమార్: కాయిన్స్, సార్.
పీతాంబరం: పక్క బాంకుకి ఫోన్ చేసి తెప్పిస్త...
అనిల్‌కుమార్: అంత దూరం ఎందుకు, సార్. మన బాంకు ముందరే ముష్టి వాళ్ళున్నారు. బోల్డు చిల్లర.
పీతాంబరం: నిజంగా ఎమ్. డి. అవ్వాల్సినంత తెలివి తేటలున్నాయోయ్ నీకు.
అనిల్‌కుమార్: ఏదో మీ దయుంటే,.,
పీతాంబరం: దయుంటే నిజంగా ఎమ్. డి. అవ్వాలనే! (ప్యూన్ రావటం చూసి) నువ్వెక్కడి కెళ్ళావోయ్?
ప్యూను: చాయ్ తాగటానికి పోయిన. (అనిల్ వీళ్ళిద్దర్నీ చూస్తూ కౌంటర్ వైపు చూడడు.
అనిల్‌కుమార్: పదిన్నరకి బ్యాంకు కొచ్చి, పదకొండున్నరకి చాయా— మళ్ళీ ఒకటిన్నరకి లంచి.
ప్యూను: ఔ! మధ్యలో రెండు గంటలు తేడా వచ్చిందా! (కుష్టువాడు వచ్చి కౌంటర్లో చెయి పెట్టాడు) ఇంకో సారి చాయ్‌కి పంపాలని యూనియన్ లో పెట్టాల గీ సారి.

అనిల్ కుష్ఠును చూసి కెవ్వున కేక వేస్తాడు.) .

పీతాంబరం: ఏమైంది?
ప్యూను: దొంగా?
పీతాంబరం: దొంగతనమా?
ప్యూను: పోలీస్—రైఫిల్—పోలీస్—(అనిల్ కింద ఒక మూలగా పడిపోయాడు.)
పీతాంబరం: ఏమైందోయ్? ( అనిల్ చూపిస్తాడు.) కుష్ఠు.
ప్యూను: ముష్టి.
అనిల్‌కుమార్: లెప్పర్.
ప్యూను: కుష్టోడు లోపలి కొచ్చినాడు.
అనిల్‌కుమార్: ఏయ్! గెటౌట్! గెటౌట్ ఫ్రం హియర్.
కుష్ఠువాడు: (ఇటూ అటూ అయోమయంగా చూసి ) అయిదు రూపాయలు బాంకులో ఎయ్యాల.
అనిల్‌కుమార్: అయిదు రూపాయలా? బాంక్‌లో ఎయ్యాలా? నీ బాబు బాంక్ ఏదీ లే దిక్కడ. గెటౌట్.


కుష్ఠువాడు: అట్లనకయ్యా. సానరోజుల్నించి పైస పైస కూడబెట్టిన.
అనిల్‌కుమార్: ఏమిటి? అయిదొందల పైసలు తెచ్చావా?
కుష్ఠువాడు: లేదయ్యా. అయిదు రూపాయలు తెచ్చినా. ఆడ రోడ్డు మీద కూసుంటె లోపలికి పోయేటోళ్ళు, బయట కొచ్చేటోళ్ళు అందర్నీ సూసీ సూసీ. . .
పీతాంబరం: నీకూ లోపలి కొచ్చి అక్కౌంటు తెరవాలనిపించింది.
పుల్యాను: అయిదు రూపాయలతో.
అనిల్‌కుమార్: అయిదు కాదు. అయిదు లక్షలు వేసినా నీ దగ్గిర డబ్బు తీసుకోం. చూస్తావేమిటి? సెంట్రీని పిలు.
పుల్యాను: ఈన్ని ఎల్లగొట్టేంద్కి సెంట్రి ఎందుకయ్యా. నేసాల్నా ఎయ్!ఎల్తావా? లేదా?
కుష్ఠువాడు : అయిదు రూపాయలః—
పుల్యాను: ఇదో, కుష్టోడా, వెంటనే ఎల్లకుంటే సెర్మం వలుస్త.
కుష్ఠువాడు: ( కాళ్ళు చూపించి ) సెర్మం లేదయ్యా. రోగం తినేసింది.
అనిల్‌కుమార్: ( నేను చూడలేను అన్న ధోరణిలో ) ఘోరం, సార్. కడుపులో తిప్పుతూంది. వాణ్ణి పంపించండి.
కుష్ఠువాడు : పదారేళ్ళ వయసులో నేనూ నీలాగే జామ పండులా ఉండేవాణ్ణి. సెర్మం దురదెట్టి డాక్టరుదగ్గరకెళ్తే కుష్ఠన్నాడు.ధర్మాసుపత్రి మందులతో అది మరింత తొందరగా పెరిగి నన్నిట్ట తయారు చేసింది.
అనిల్‌కుమార్ : వీడిక్కడే తన హిస్టరీ మొదలు పెట్టాడు, సార్.
పీతాంబరం : చూడు, బాబూ. ఇక్కడ కష్టమర్లు వాళ్ళు తిరుగుతూ ఉంటారు. ఒక్క అయిదు రూపాయల కోసం అందర్నీ ఇబ్బంది పెట్టటం ఎందుకు? నీ దగ్గరే ఉంచుకోకూడదూ.
కుష్ఠువాడు : మీ అందర్నీ చూసి నాకూ అప్పుడప్పుడు, అట్టా గుండాలని పిస్తుందయ్యా.
అనిల్‌కుమార్ : ఇంకా నయం. మా బాంకులో పని చెయ్యాలనిపించలే. వెధవ సాడిస్టు మెంటాలిటీ.
పీతాంబరం: కష్.(కుష్ఠుతో) కస్టమర్లొచ్చే వేళయింది. ఒక గంటయ్యాక రాపో.
కుష్ఠువాడు : గంటయినాకా—
పుల్యాను : (కదిలి) ఆఁ ఆఁ—తర్వాత రాపో (అని పంపిస్తాడు.)
అనిల్ కుమార్ : 'కాసేపయ్యాక రాపో' అనటంలో మీ ఉద్దేశం?
పీతాంబరం : ఇందులో ఉద్దేశం ఏముంది? రభస చేసుకోవడం — అదీ కస్టమర్లు వచ్చే వేళ ఎందుకని — ఒక గంట ఆగి రమ్మన్నాను.
అనిల్‌కుమార్ : అంటే మళ్ళీ తర్వాత వాడొస్తే అయిదూ తీసుకోవాల్సిందేనా?
పీతాంబరం : తప్పకుండా.
అనిల్‌కుమార్ : ఇంకా నయం. లోపల ఛైర్లో కూచోపెట్టి టీ ఇస్తాం అన్నారు కాదు.
పీతాంబరం : ఎ డిపాజిటర్ ఈజ్ ఆల్వేస్ ఎ డిపాజిటర్.
అనిల్‌కుమార్ : అయితే, అయిదూ తీసుకోవాల్సిందే.
పీతాంబరం : తీసుకోవాల్సిందే.
అనిల్‌కుమార్ : వద్దన కూడదు.
పీతాంబరం : అనకూడదు.

( అనిల్ చేయి చాస్తే, పుల్యాను పాకెట్‌లోంచి చిన్న బుక్ తీసి చేతిలో పెడతాడు. అనిల్ దాన్ని తెరిచి పీతాంబరానికి చూపిస్తాడు. )

పీతాంబరం: ఏమిటిది?
అనిల్‌కుమార్ : బై పార్టైట్ అగ్రిమెంట్—యూనియన్‌కీ, మానేజిమెంటుకీ మధ్య ప్రభుత్వం అప్పాయింట్ చేసిన అప్పులస్వామి కమీషన్ పదో రూలు సబ్—సెక్షన్ "బి" ప్రకారం క్యాషియర్ కస్టమర్ దగ్గర్నుంచి డబ్బు తీసుకోవటానికి నిరాకరించవచ్చు. అటువంటి పరిస్థితిలో మేనేజిమెంటు కాషియర్‌కి డెటాల్ సీసా ఏర్పాటు చేయాలని కూడా వ్రాసి ఉంది చూడండి.
పీతాంబరం: ఈ అగ్రిమెంటు దాచుకున్నంత భద్రంగా ఆఫీసు కాగితాలు దాస్తే, నీకు ప్రమోషన్ వచ్చి ఉండేది.
పుల్యాను : ఆయ నడుగురుప్పది డెటాల్ సీసా.
పీతాంబరం : ఎందుకోయ్ డెటాల్? ( అనిల్‌తో )



అనిల్‌కుమార్ : వాడు ఇచ్చిన అయిదు రూపాయల నోటుతోపాటు సూక్ష్మ క్రిములు నాలో ప్రవేశిస్తే?
పీతాంబరం : అవేగా చచ్చేది! ( పుల్యానుతో ) ఓచర్ రాసి డెటాల్ ఒకటి తీసుకురా వెళ్ళి.
పుల్యాను : ఓవర్ టైమ్ ఇస్తర మల్ల?
పీతాంబరం : డెటాల్ తీసుకు రావడానికి ఓవర్‌టైమా?
పుల్యాను : మల్ల. బాంకు టైమ్‌ల బైటికి పోయేటంద్కు రూల్సు లేవు గదయ్యా.
పీతాంబరం : భగవంతుడా! క్రితం జన్మ తాలూకు తనేదైనా ఉండె, ఈ జన్మలో పిల్లిగానో, కుక్కగానో, పందికొక్కుగానో పుట్టించుగాని, బాంకు మానేజరుగా మాత్రం పుట్టించకయ్యా.
పుల్యాను : అస లిది సాయంత్రం మా యూనియన్‌లో పెట్టాలి మా పోరగాళ్ళంతా ఏమంటారో చూసి అప్పుడు సెప్తం ఏం చెయ్యాల్నో.
పీతాంబరం : ఎమ్. డి. గార్ని అడిగొస్తా నేం జెయ్యాలో?( లోపలికి వెళ్తాడు.)
పుల్యాను : అసలేం జరిగిందయ్యా. గట్టరిసినవ్ —
అనిల్‌కుమార్ : హిచ్ కాక్ సినిమా చూసేవా?
పుల్యాన్ : హుష్ కాకా—



అనిల్‌కుమార్ : హుష్ కాకి కాదు. హిచ్‌కాక్—ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్.
పుల్యాను : లే. సూడ్లే.
అనిల్‌కుమార్: ఒక కౌంటర్—లోపల మసక చీకటి. ఒక అందమైన యువకుడు నాలాంటి వాడున్న మాట.పనిచేసుకుంటున్నాడు. ఒక హేండ్ చెయ్యినెమ్మదిగా పాములా వచ్చింది లోపలికి. ఒక వేలుకి చీము — ఒక వేలుకి నెత్తురు. ఒక వేలు తెలుపు, ఒక వేలు ఎరుపు — అంతే. ( అరచి ) ఇలా అరిచేను.

( పీతాంబరం వచ్చాడు. )

పుల్యాను : ఏమన్నారు, సార్.
పీతాంబరం : రిజర్వ్ బాంక్‌కు వ్రాసి క్లారిఫికేషను కనుక్కోమన్నారు.
అనిల్‌కుమార్ : ఈ లోపులో ఏం చెయ్యాలి?
పీతాంబరం : అభిప్రాయాలు ఏమైనా, మానేజిమెంటు చెప్పింది వినటం మన ధర్మం. వాణ్ణి పంపించాలి—ఎలాగైనా నచ్చచెప్పి.
పుల్యాను : మరిప్పుడు ఆ కుష్టోడొస్తే?
అనిల్‌కుమార్ : మెడపట్టుకొని బైటకు గెంటటమే.
పుల్యాను : ఎవరు — నానాసయ్యా!
అనిల్‌కుమార్ : మరి లేకపోతే నేనా?
పుల్యాను : ఈ సేతులో ఆణ్ణి ముట్టుకోవటమా.



చిత్రం: కె. కుమార్

అనిల్‌కుమార్ : సేతుల్తో ముట్టుకోలేకపోతె కర్రతో తీయాలోయ్.
పీతాంబరం : అంత పని చెయ్యకు. మెల్లిగా చెప్పి పంపిద్దాం.
అనిల్‌కుమార్ : అదిగో వస్తున్నాడు.
(అందరూ అటు చూస్తున్నారు. నెమ్మదిగా కుష్టువాడు వచ్చాడు.)
కుష్ఠువాడు : గంట అయిందయ్యా.
అనిల్‌కుమార్: అవునన్నట్లు ఇంకో బాంకులో వేసుకోకూడదూ. ఊర్నిండా బాంకులేకదా.
కుష్ఠువాడు : నేను కూర్చొనేది ఇక్కడే కదయ్యా. అందుకే ఈ బాంకులో ఏసుకుంటనన్న. వచ్చేది వర్షాకాలమాయె.
ప్యూను : నోటును చిల్లరగా మార్చుకో నుంచుకో రాదయ్యా.
కుష్ఠువాడు : ఉంచుకోవచ్చు. ఎందుకు దాచుకోరాదో చెప్తే.
ప్యూను : ఎందుకు చెప్పాలి? సెప్పే అవసరం మాకు లేదు. వెళ్ళు.
అనిల్‌కుమార్ : వాణ్ణి బతిమాలే అవసరం మన కేమిటోయ్. ఇదిగో చూడూ — నువ్వు కుష్ఠువాడివి. నువ్వు కాష్ కౌంటర్‌లో చెయ్యి పెడితే అక్కడ చీమూ నెత్తురూ అంటుకుంటుంది.
కుష్ఠువాడు : చీమూ నెత్తురూ మీకూ ఉన్నాయి కదండీ.
ప్యూను : ప్రశ్నకు ప్రశ్న.
అనిల్‌కుమార్ : ఇదేదో అసెంబ్లీ అనుకుంటున్నాడు. అలా చూస్తూ నిలబడక పోతే వాడికి చెప్పి పంపించలేవూ.
ప్యూను : ఏమని చెప్పాలి. ఏం చెప్పినా ఈడు ఇనడు.
అనిల్‌కుమార్ : వినకపోతే మెడబట్టి గెంటు.
కుష్ఠువాడు : గెంట నక్కర్లేదు. నేనే వెళ్తాను. కానీ, నాకు చెప్పండి, నే నెందుకు బాంకులో ...
ప్యూను : ఏంది చెప్పేది? ఎల్లెలు. ( అని తోస్తే కుష్ఠువాడు కింద పడ్తాడు, నాటకం ప్రారంభం అయిన దగ్గర్నుంచి ఒక మూల బెంచీ మీద నిద్ర పోతున్న లాయరు లేచి—)
లాయరు : ఐ ప్రొటెస్ట్ దిస్ అండర్ ది కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ ద కంట్రీ. ఈ కుష్ఠువాడికి ఈ రోజు జరిగిన అన్యాయం ప్రజాస్వామ్యానికే ఒక మచ్చ. బాంక్ అనే ఒక పబ్లిక్ ప్లేస్‌లోకి డిపాజిట్ చెయ్యడానికి వచ్చిన ఒక పెద్ద మనిషి మీద అకారణంగా చేయి చేసుకున్నా రన్న కారణంగా మీ మీదా, మీ బాంక్ మీదా ఇరవై వేలకి దావా వేయ దలచుకున్నాను.
పీతాంబరం: ఈయ నెవరు—దావా అంటాడు. ( ప్యూన్ లోపలి కెళతాడు )
అనిల్‌కుమార్: లాయర్ పంతులు. ఆ ఎదురు కోర్టులో నిలబడితే చెట్టు కింద ప్లీడ రుంటారని మన బాంక్ లోనే కూర్చుంటాడు.
పీతాంబరం: వాడే మన కొంప ముంచేటట్టున్నాడు. ఇదిగో, ప్లీడరూ, ఇది మాకూ మాకూ సంబంధించిన విషయం. నువ్వు జోక్యం కల్పించుకోకు.
లాయరు: ఇది పబ్లిక్ ప్లేస్. నేను పబ్లిక్ మనిషిని. ఇది పబ్లిక్ వ్యవహారం.
అనిల్‌కుమార్: కానీ ఎ థర్డ్ పార్టీ టు ద కంట్రాక్ట్ ఈజు ఆల్వేస్ ఎ థర్డ్ పార్టీ.
పీతాంబరం: బి. కామ్. పరిజ్ఞానంతోనైనా బాగా చెప్పావోయ్. ( లాయర్‌తో ) కాబట్టి ఈ వ్యవహారంలో జోక్యం కల్పించుకోకండి.
లాయరు: ఈ వ్యవహారంతో నాకు సంబంధం ఉంది.
పీతాంబరం: లేదు.
లాయరు: ( గట్టిగా ) ఉంది.
పీతాంబరం: ( ఇంకా గట్టిగా ) ఎలా ఉందో చెప్పండి.
లాయరు: ఇతను ఈ క్షణం నుంచే నా క్లయింట్ కాబట్టి.
అనిల్‌కుమార్: చెట్టు కింద ముష్టి ప్లీడరుకి బాంకు ముందు కుష్ఠువాడు క్లయింటా?
లాయరు: ఈ ఒక్క మాట మీదా ఇంకో పది వేలకి పరువు నష్టం దావా వెయ్యకపోతే నా పేరు పంతులు కాదు.
పీతాంబరం: మీ పే రేదైతే మా కేం. ఇది మా బాంకు. మా వ్యవహారం.
లాయరు: ఓహో! అలాగా మరయితే! ''మా బాంక్‌లో డిపాజిట్ వేయండి. నిశ్చింతగా ఉండండి'' అని అడ్వర్‌టైజుమెంట్ ఎందుకు చేశారు? ఒక్క సారి అలా ప్రకటించగానే, అది ఓపెన్ ఆఫర్. సెక్షన్ 2 ( డి ) ఆఫ్ ది కాంట్రాక్ట్ యాక్ట్ సేస్ దట్ వెన్ యాన్ ఓపెన్ ఆఫర్ ఈజు యాక్‌సెప్టెడ్ ఇట్ బికమ్స్ ఎ కాంట్రాక్ట్.
అనిల్‌కుమార్: ఇదిగో మా లీగల్ అడ్వయిజర్ పోస్ట్ ఇంకా ఖాళీగానే ఉంది. అది భీలప్పు అయ్యేవరకూ లీగల్ పాయింట్లు మాట్లాడక.
లాయరు: ఐ డోంట్ బిలీవ్ ఇన్ ''మాటలు''—ఇదిగో నీ పేరేమిటి?
కుష్ఠువాడు: కుష్ఠు.
లాయరు: వ్యాధి కాదయ్యా. పేరు. మీ రెండూ ఒకటేలే. నాతో రా బాంకుకి-లాయరు నోటీసు ఇవ్వాలి.
కుష్ఠువాడు: ( వెళుతూ ) అయిదు పైస లియ్యి, దొరా. బోణీయే కాలే ఈ రోజు.
లాయరు: నాకు సంవత్సరం నుంచీ కాలేదు బోణీ. పద పద.
( అక్కడే బల్లమీద కూర్చున్నారు.)
ప్యూను: ( లోపలి నుంచి వచ్చి ) అయ్యగారు పిలుస్తున్నారు.
పీతాంబరం: ఇంకా ఎవరున్నారు లోపల?
ప్యూను: సేట్ చమన్‌లాల్ సాబ్ ఉన్నారు.
పీతాంబరం: బాలా షా కంపెనీ?
అనిల్‌కుమార్: అవున్సార్. మను షా కంపెనీ కిచ్చిన సంబై లక్షలు అప్పు చాలదనీ, కోటి రూపాయ లన్నా కావాలనీ చమన్‌లాల్‌గారు అప్లికేషన్ పెట్టారు.
పీతాంబరం: ఇది బాం కనుకున్నాడా, అత్తవారిల్లనుకున్నాడా? (లోపలికి వెళతాడు. అనిల్, ప్యూన్ చెరో వైపు గుమ్మానికి చేరుతారు వినడానికి. )
ప్యూను: డబ్బున్న వాళ్ళకి డబ్బు ఈయటానికి ఈయన నసలు ఒప్పుకోరు.
అనిల్‌కుమార్: అందుకే చివాట్లు తింటున్నాడు. అసలు మనందరికి జీతాలు వస్తున్నాయీ అంటే దానికి కారణం సేట్లే కదా—వాళ్ళ కప్పు ఇవ్వనంటే ఎలా? ( విని ) బాగా చీవాట్లు పడుతున్నాయి గురువుగారికి.
ప్యూను: అదిగో వస్తున్నాడు. ( ఇద్దరూ చప్పున తమ తమ సీట్ల దగ్గిరికి పరుగెడతారు. లోపల నుంచి పీతాంబరం వాడిపోయిన మొహంతో వస్తాడు. )
అనిల్‌కుమార్: ( అమాయకంగా ) ఏమైంది, సార్?
పీతాంబరం: ఇప్పటికే చమన్‌లాల్‌కి మరం చాలా ఇచ్చామనీ, ఇంకివ్వక్కర్లేదనీ నే నంటే, ఆయన ఒప్పుకోలేదు. ఆయనే ఫైల్ మీద ఇంకో అరవై లక్షలు శాంక్షను చేశారు.
అనిల్‌కుమార్: నా దగ్గర ఫైలు తీసుకుని చెప్పులు కుట్టేవాడికి మీరు ఆరొందలు శాంక్షన్ చేసినట్టు—
పీతాంబరం: నేను చేసింది ఒక కుటుంబం నిలబెట్టడం కోసం. ఆయన చేస్తూంది వంద కుటుంబాలని ఏడిపించటం కోసం.

(సశేషం)

## (క్రిందటి సంచిక తరువాయి)

పుల్యాను: సేట్‌కి అప్పిస్తే కుటుంబా లేద్బే దేంది?

పీతాంబరం: ఆ అరవై లక్షలతో మరింత స్టాకు కొని దాస్తాడు. దాంతో ధరలు పెరుగుతాయి. ప్రజ లేడుస్తారు.

అనిల్‌కుమార్: కానీ, ఆ అప్పు మనం ఇవ్వకపోతే ఇంకో బాంకు ఇస్తుంది. మన మూలస్తంభాల్లాంటి కస్టమర్లు ఇంకో బాంకుకి వెళ్ళిపోతే మనకి ఉద్యోగా లుండవ్.

పీతాంబరం: అందుకని కాకుల్ని కొట్టి గద్దలకి వేస్తానూ.

పుల్యాను: నే నైతే సద్దుకోలేదు. ఈ నంటడు ఏందది. బి. కాప్. ల—

అనిల్‌కుమార్: ఎకనమిక్స్.

పుల్యాను: ఆ గదీ ఆ మిక్సుకూడా తెల్వదు. కాని బాంకంటె ఏంది? తీసుకునేవోడికి ఏసేటోడికి మిక్సింగ్. పైస లెవడేసినా తీసుకోవాలి. ఇచ్చేటప్పుడు మాత్రం జాగ్రత్తగా సూసుకుని ఇవ్వాల. లేకుంటే ఉద్దోగం పోద్ది.

మోచోడు: (వచ్చి) దండాల్దొర. (అందరూ చూసేరు.)

పీతాంబరం: ఏమోయ్. ఆర్నెల్లయింది. అసలు కనబడలేదు.

అనిల్‌కుమార్: తీసుకునేటప్పుడున్నంత హుషారు తీర్చేటప్పుడు ఉండదు.

మోచోడు: అంత మాటనకయ్యా. మొదటి నెల వాయిదా తీరుద్దామనుకుంటె మున్సిపాలిటీ వాడొచ్చి తీసుకుపోయె. రెండో నెల పైస లియ్యకుంటె పాకలు ఖాళీ చేయిస్తామని పోలీసోడొచ్చి పాయె.

అనిల్‌కుమార్: మూడో నెల ఎలక్ట్రిసిటీ వాడూ, నాలుగో నెల వాటర్ వాడూ, అయిదో నెల ఇన్‌కమ్‌టాక్సు వాడూ వచ్చారు. అంతేగా నువ్వు చెప్పేది. మొత్తంమీద డబ్బుల్లేవు.

నమ్మి అప్పిచ్చినవ్. పాణం పోయినా అప్పు దీరినాకే పోవా లది. పాణం పోయినా, అప్పు దీరినాకే—అప్పు దీరినాకే... (వెళ్ళిపోతాడు.)

(అనిల్ ఫైల్ ఇస్తాడు.)

పీతాంబరం: ఏమిటిది?

అనిల్ కుమార్: అప్పు ఎగ్గొట్టిన వాళ్ళ ప్రోగ్రెస్ రిపోర్ట్సు. అందులో ఇతని పేరూ చేరుస్తున్నా.

పీతాంబరం: (చాలాసేపు నిశ్శబ్దం తర్వాత) చేర్చక తప్పదంటావా?

అనిల్ కుమార్: మానేజిమెంటు సెంటిమెంటుని గుర్తించదు, సార్.

పీతాంబరం: అవును. గుర్తించదు. ఏజ ఐ హేవ్ ఫ్లెన్ ది లెండింగ్ ఫ్రమ్ కేపిటలిస్టు టు రిస్కీ ఎడ్వాన్సెస్, ఐ విల్ బి ఆస్కుడ ఎక్స్‌ప్లనేషన్.

అనిల్ కుమార్: ఆ ఎక్స్‌ప్లనేషన్ తరువాత మాసుకోవచ్చు. ముం దీ లాయరు గారి విషయం చూడండి.

పీతాంబరం: ఏం చూడాలి? కోర్టులోనే తేల్చుకుందాం. నోటీసివ్వనీ.

అనిల్ కుమార్: మానేజిమెంటునే సలహా అడుగుదాం. ఏం చెప్తారో?

పీతాంబరం: ఇంత చిన్న సమస్య పరిష్కరించలేమని ఏ అరవ్వాణ్ణో, కన్నడప్పోణ్ణో తీసుకొచ్చి మనపై ఆఫీసరుగా వేస్తాడు. వ్యాధికి మందేస్తే అంటువ్యాధి వచ్చినట్టు— (ఏదో ఆలోచన వచ్చినట్టు) ఐడియా.

అనిల్ కుమార్: ఏమిటి, సార్.

(లాయరూ వెనుక కుష్ఠువాడూ వచ్చారు.)

లాయరు: ఇదిగో, నోటీసు తీసుకుంటారా—పోస్టులో పంపించమంటారా?

పీతాంబరం: తీసుకుంటాం గానీ, ముం దీ సంగతి చెప్పండి. బాంకంటే పబ్లిక్ ప్లేస్ అని మీా రొప్పుకున్నారు కదా!

లాయరు: ఆం.

# ముక్తియుద్ధం నాటిక

**- యండమూరి వీరేంద్రనాథ్**

మోచోడు: ఉన్నాయి, బాబయ్యా. మాట నిలుపు కోవాలని ఆరో నెల రాత్తిర్లు నిద్రకూడా మాని కుట్టి నానయ్య సెప్పులు. ఆరోగ్యం సెడితే అస్పత్రిలో ఆడు తీసుకున్నాడయ్యా, ఆరో నెల సంపాదించిన పైసలు.

అనిల్‌కుమార్: అందుకే, సార్. ఇలాంటి వాళ్ళకి అప్పిస్తే మనం ట్రబుల్‌లో పడతాం.

పీతాంబరం: మరి నీ కొడుకు సాయం చేయడం లేదా నీకు.

మోచోడు: ఆడు సదువుకున్నోడు, బాబయ్యా. సేత్తాడు. కాని మన సీడ ఉండదు. బూట్లేసుకున్నోళ్ళనీ—గా మెడకు టై బిగించుకున్నోళ్ళనీ సూత్తా ఉండి పోతాడు. ఆడి కుద్దోగం కావాల. కులవృత్తి నామోషి.

పీతాంబరం: వేణ్ణీళ్ళకి చన్నీళ్ళు తోడవకపోతే లాభం లేదని అతడికి నచ్చ చెప్పు. ఇప్పుడు నీవు వాయిదా కట్టకపోతే వడ్డీకి పెనాల్టీ పడుతుంది.

అనిల్ కుమార్: ఆ పెనాల్టీ మీాద వడ్డీ—మళ్ళీ ఆ వడ్డీమీాద పెనాల్టీ పడుతుంది. అది మొత్తం కలిపితే అసలుకన్న ఎక్కువ అవుతుంది.

మోచోడు: అంత పని సెయ్యకండి, బాబూ. ఎట్లాగయినా దీరుస్త.

పీతాంబరం: ఒక పనింత—డబ్బు వేసేది కొనుక్కో. ఎంతొచ్చిందీ అని చూడ కుండా అందులే వెయ్యి. పైసా అయినా సరే. అలా చేస్తే గాని అప్పు తీరదు.

మోచోడు: చేస్త, బాబూ. మరింత కష్టబడ్త. మావోణ్ణి మరింత బతిమాల్త. మూరం కొండల నునుపు సూడకొరేయ్. రెక్కలొచ్చిన పక్షిలాగ, ఈ అప్పు దీరేక కావాల్నంటె ఎగిరిపో. గంతొరకు కాటికి కాల్లు సాసుకున్న తండ్రికోసం రెక్కలల్లార్చమంట. ఇద్దరం కష్టపడతం. నాకు ఆడు లేబరు. ఆడికి నేను లేబరు. ఇద్దరం కష్టపడతాం, బాబూ. నమ్మల్ని

పీతాంబరం: కుష్ఠు కంటేజియస్ డిసీజ్ కదా.

లాయరు: కంటేజియస్ అంటే—

పీతాంబరం: అంటే, అంటువ్యాధి— పబ్లిక్ ప్లేస్‌లోకి అంటువ్యాధి ఉన్న వాళ్ళని నిషేధించవచ్చు కాబట్టి, మీా క్లయింట్‌ని తిరస్కరిస్తున్నాం.

లాయరు: కుష్ఠు అంటు వ్యాధి కాదు.

పీతాంబరం: అవును.

లాయరు: కాదు (అని ఘర్షణ పడతారు.)

పీతాంబరం: అనిల్ కుమారూ, జనరల్ హాస్పిటల్‌కి ఫోన్ చేసి కనుక్కో.

అనిల్ కుమార్: యస్సర్ (అని వెళ్తాడు.)

పీతాంబరం: ఇప్పు డీ విషయం తేల్చేదాం. ఇలా కూర్చోండి.

లాయరు: అఫీషియల్ కుర్చీ నాకెందుకు లెండి.

అనిల్ కుమార్: (వచ్చి) స్కిన్ స్పెషలిస్టు డాక్టరుగారూ, సేథాంజి నర్సు గారూ గండిపేట పిక్నిక్‌కి వెళ్ళారట, సార్.

పీతాంబరం: అసిస్టెంట్ స్కిన్ స్పెషలిస్టుని కనుక్కోవోయ్.

అనిల్ కుమార్: అలాగే, సార్. (వెళ్ళాడు.)

పీతాంబరం: కూర్చోండి. అఫీషియల్ కుర్చీ అయినా పర్వాలేదు. కూర్చోండి. పోనీ మీారు అఫీషియల్ అయిపోకూడదూ—

లాయరు: అంత అదృష్టం కూడానా.

అనిల్ కుమార్: (కాగితంతో వస్తూ) మొత్తం కుష్ఠు చరిత్ర అంతా తెలిసి పోయింది, సార్. కుష్ఠు! మెడికల్ టెర్మినాలజీలో చెప్పాలంటే హాన్సెన్! దీంట్లో చాలా రకాలున్నాయి. హైలీ ఇన్‌ఫెక్షస్ ట్యూబర్‌కొలాయిడ్

భయంకరమైనది. నాన్—ట్యూబర్‌కొలాయిడ్‌లో సార్—న్యూరో లెప్రసీ అంటువ్యాధి కాదుగానీ, నోడులర్ స్టేజ్‌లో కంటేజియస్ స్టేజ్ హాప్పెన్స్ అయితే—

పీతాంబరం : నీ కుష్ఠు చరిత్ర తగలెయ్య, నాకు పిచ్చెక్కుతోందయ్యా.

అనిల్ కుమార్: ఆ కుష్ఠువాడికి ఏ రకం రోగమో పరీక్ష చేయిద్దామా, సార్.

పీతాంబరం : పరీక్షా.

అనిల్ కుమార్ : అదే—వాడి కున్నది అంటు కుష్ఠో, అంటుకోని కుష్ఠో, డాక్టరుచేత పరీక్ష చేయించి—

పీతాంబరం : ప్రతి బ్రాంచిలోనూ డాక్టర్లని పెట్టి, వచ్చిన కస్టమర్‌నల్లా ఏయే వ్యాధులున్నాయో పరీక్ష చేయించమంటావుటయ్యా.

ప్యూను : (వస్తూ) గిదో గీ పేపరు నిండా గీ న్యూసే.

పీతాంబరం : అప్పుడే పేపర్లదాకా ఎక్కిందా.

లాయరు : మరి లాయరు పంతులంటే...

అనిల్ కుమార్ : (చదువుతూ) "బాంకులోకి ప్రవేశించడానికి కుష్ఠువాడు అనర్హుడా!" అదీ హెడ్డింగ్. ఎనిమిది వందల కోట్ల డిపాజిట్లతో నాలుగు




వందల కోట్ల ఋణాల్తో విలసిల్లుతున్న సెంట్రలీ ఏర్—కండిషన్డ్ బాంక్‌లోకి ఒక కుష్ఠువాడు ప్రవేశిస్తే ఏమవుతుంది—జనవరి ఏడు— ఈ రోజు బాంక్ ఆఫ్... (తల తిప్పి) మన గురించి...వూ...దీని గురించి జస్టిస్ రామనాథన్ అభిప్రాయం...వచ్చే వారం నుంచీ ప్రతి ఆదివారం చర్చ. పాఠకుల అభిప్రాయం వ్రాయండి. ఉత్తమ అభిప్రాయానికి పారితోషికం పాతిక రూపాయలు. సమస్య— బాంకులోకి ముష్టివాడు ప్రవేశానర్హు...

పీతాంబరం : ఈ ముష్టి ఏమిటో గాని, నాకొచ్చేట్టు ఉందయ్యా కుష్ఠు.

అనిల్ కుమార్ : సార్—ఈ మూల చూడండి. (పేపరు చూపించి) అసెంబ్లీలో ఈ సమస్య చర్చించడానికి ప్రతిపక్షాల నిర్ణయం...కృష్ణ దేవరాయుల గ్రంథాలయంలో కుష్ఠుమీద గోష్ఠి—

లాయరు : తీసుకో ఈ నోటీసు. మీ ఎమ్. డి. గారి కిచ్చిరా.

(ప్యూను లోపలి కెళ్తాడు.)

ప్యూను : ఏమిటే దయ్యా ఇది.

లాయరు : డిపాజిటర్ దగ్గర డబ్బు తీసుకోవటం నిరాకరించినందుకు పదివేలకీ, వాణ్ణి తోసేసినందుకు ఇరవైవేలకీ, నన్ను ముష్టి పీడ రన్నందుకు ఏడు వేలకీ—మొత్తం ముప్ఫయి ఏడువేలకి మీ మీద దావా.

పీతాంబరం : మీ క్లయింట్ దగ్గర్నుంచి డిపాజిట్ తీసుకొని, మీ పట్ల అవమానకరంగా మాట్లాడినందుకు మా ఏకాంబరం తరఫున ఈ బ్రాంచి సీనియర్ ఆఫీసరుగా నేను క్షమాపణ చెప్పుకుంటే, మీ దావా విరమించుకొంటారా—

అనిల్ కుమార్ : దీనికి నే నొప్పుకోను.

పీతాంబరం : మీరు ఒప్పుకోవడం—ఒప్పుకోవడాల ప్రసక్తి లేదు. అందుకే "ఈ బ్రాంచి సీనియర్ ఆఫీసరుగా" అన్నాను. గోటితో పోయే గొడవని గొడ్డలిదాకా తేవడం నా కిష్టం లేదు.

అనిల్ కుమార్: మీరు ఆఫీసరు అయ్యుండవచ్చు. ఇది మన ప్రిస్టేజి కొశ్చను.

పీతాంబరం: కోర్టు కెళ్ళినా అతడే గెలుస్తాడు. (గట్టిగా)

అనిల్ కుమార్: అందుకని క్షమాపణ చెప్పుకుంటామా? (ఇంకా గట్టిగా)

పీతాంబరం: మనం చేసింది తప్పు.

అనిల్ కుమార్:(ఇంకా గట్టిగా) ఆ తప్పేదో కోర్టులో తేల్చుకుందాం.

పీతాంబరం: ఐడోంట్ వాంట్ ఇట్ ( అని లాయరు వైపు తిరిగి) ఏం, ఒప్పుకుంటారా?

లాయరు: ఒప్పుకుంటున్నాను.

పీతాంబరం: (అనిల్‌తో) డిపాజిట్ తీసుకో అతని దగ్గర్నుంచి.

అనిల్ కుమార్: డెటాల్.

పీతాంబరం: డెటాల్ లేదు. క్రిస్టాల్ లేదు. క్లర్కుల, ప్యూన్ల దయాదాక్షిణ్యాలమీద ఆధారపడితే, బాంక్ ఇలాగే ఉంటుంది. తీసుకుంటావా, లేదా? లేకపోతే కాష్‌లో నేను కూర్చుంటాను.

అనిల్ కుమార్: (తటపటాయించి) తీసుకుంటాను. (కుష్ఠువాడితో) నీ తరఫున సంతకం ఎవరు పెడుతున్నారు?

లాయరు: నేను ( అని కాగితం కౌంటర్‌లోంచి ఇస్తాడు.)

అనిల్ కుమార్: పాస్ బుక్ రేపొచ్చి తీసుకెళ్ళు. ఇదిగో రసీదు. (కుష్ఠువాడు లాయరు దగ్గర కొచ్చాడు. ప్యూను పీతాంబరం దగ్గరకొచ్చి సంతకం

పెట్టించుకొని, కౌంటరు దగ్గరకు వెళ్తున్నాడు. ఆఫీసు రొటీన్‌గా నడుస్తున్న వాతావరణం.)

కుష్ఠువాడు : (లాయరుతో) అయిదు రూపాయలు వేసుకున్నా, బాబూ.

లాయరు: ఇదిగో—ఈ అర్ధరూపాయి తీస్కో.

కుష్ఠువాడు: బాబులు సల్లగుండాలి.

లాయరు: అది ధర్మం కాదు. వెళ్ళి అకౌంట్‌లో వేసిరా—వేసిరా. ఎందుకు చెప్తున్నానో విను.

అనిల్ కుమార్ : ఏమిటి మళ్ళీ—

కుష్ఠువాడు : ఈ అర్ధ రూపాయి ఏస్కోవాలి, బాబూ.

అనిల్ కుమార్: అర్ధ రూపాయా—ఇంకా నయం—అయిదు పైసలు వేస్తానన్నావ్ కాదు.

పీతాంబరం: తీసుకోవాలి. తప్పదు. తీసుకో. (తీసుకుంటాడు. లాయరు బల్లమీద కూచొని ఏదో రాస్తున్నాడు. కుష్ఠువాడు తిరిగి రావడం చూసి) తీసుకున్నాడా?

కుష్ఠువాడు : తీసుకున్నారు, బాబు.

లాయరు: ఇదిగో—ఇది తీసుకో. వెళ్లి ఒక నలభై పైసలు విత్‌డ్రా చేసి తీసుకురా. అలా చూడకు. వెళ్ళి తీసుకురా.

(కుష్ఠువాడు బయల్దేరాడు. మళ్ళీ మ్యూజిక్ ప్రారంభం)

అనిల్ కుమార్ : వీడు మళ్ళీ వస్తున్నాడు, సార్. ప్రతి అయిదు నిముషాలకీ ఒక పది పైసలు వేస్తున్నాడు—తీస్తున్నాడు.

ప్యూను : గిట్టయితే మన మిగతా డిపాజిట్లు గోవిందా.

అనిల్ కుమార్ : చీము, నెత్తురుతో కౌంటర్ పాడు చేస్తున్నాడు.

ప్యూను : కస్టమర్లు గోవిందా—

అనిల్ కుమార్ : టైమ్ వేస్ట్ చేస్తున్నాడు.

ప్యూను : బాంక్ గోవిందా—

అనిల్ కుమార్ : అందరూ కలిసి బాంక్‌ని ముంచేస్తున్నారు, దేముడో. దీన్ని మానేజిమెంట్ సెటిల్ చేయాలి, దేముడో.

(అని లోపలికి పరుగెత్తాడు)

పీతాంబరం : నేను మాట్లాడింది మనుషుల హక్కుకోసం. అంతే కానీ, బాంక్‌ని నాశనం చేయడానిక్కాదు. (కుష్ఠువాడి దగ్గరికెళ్ళి) చూడు, బాబూ, నువ్వు లక్ష వేసినా, పైసావేసినా మేం తీసుకోవాలి—తప్పదు. కాని, ఇలా మమ్మల్ని ఇబ్బంది పెట్టడం భావ్యం కాదు. ఇక వెళ్ళు.

కుష్ఠువాడు : అంత మాటనకు, బాబయ్యా. నాకు మాత్రం పంత మేడుంది? ఇదిగో—ఈయన ఎయ్యమంటే ఏసిన, మళ్ళీ తీసిన. అంతే!

లాయరు : నా క్లయింటుతో డైరెక్టుగా మాట్లాడడం ఇల్లీగల్.

పీతాంబరం : ఇలా అరిస్తే న్యూసెన్స్ కేస్ కింద పోలీసులకి కంప్లయింట్ ఇవ్వాల్సొస్తుంది. మీ రెళ్ళచ్చు.

అనిల్ కుమార్ : (రెండు కవర్లతో వచ్చాడు.) ఇదిగో—ఇది నీకు.

ప్యూను : గీ మాత్రం సదువు నాకేడ వస్తుందయ్యా. (పీతాంబరంతో) జరంత సద్వి చెప్పు. (ఇచ్చి) ఏదైనా ప్రమోషన్ ఆర్డరా?

పీతాంబరం : వచ్చిన కస్టమరు మీద చెయ్యి చేసుకున్నందుకు నిన్ను సస్పెండు చేస్తున్నట్టు ఆర్డరు.

ప్యూను : సస్పెండా—ఎల్లగొట్టమున్నది మానేజిమెంటే కదా.

అనిల్ కుమార్ : (ఈ లోపులో తన కవరు చదువుకొని) నన్నూ ఎక్స్‌ప్లనేషన్ అడుగుతూ మెమో ఇచ్చారు, సార్. నా కాన్ఫిడెన్షియల్ రిపోర్టు—నా ప్రమోషన్.

ప్యూను : అన్యాయం.. పై అధికారులు చెప్పిన పనిని చేసిన ఒక ప్యూను మీద ఈ చర్య అవమానం. అమానుషం. మానేజిమెంటు గూండా చర్యలు నశించాలి.

అనిల్ కుమార్ : (ఆవేశంగా) బైపార్ టైట్ అగ్రిమెంటు ప్రకారం డెటాల్‌సీసా అడిగిన ఒక క్లర్కుకి మెమో ఇవ్వడం—అన్యాయం. యూనియన్—

ప్యూను : జిందాబాద్. ప్రజాస్వామ్యం—

లాయరు : వర్ధిల్లాలి. (అందరూ ఉలిక్కిపడి లాయరు వైపు చూస్తారు.) ఎక్కడ ప్రజలకి అన్యాయం జరుగుతుందో అక్కడ లాయరు పంతులుంటాడు.

ప్యూను : రాజకీయాల్లో ఉండాల్సినోడివి, పంతులూ, నువ్వు. యూనియన్—

(లాయరు, అనిల్— జిందాబాద్'' అని అరుస్తారు.)

పీతాంబరం: ఏమిటిది?

ప్యూను: బాంక్ స్ట్రైక్ చేస్తున్నారు.

(అంతా గందరగోళంగా అరుస్తుంటారు. వింగుల్లోంచి— జనంలోంచి— ''అధికారుల నిరంకుశత్వం నశించాలి— యూనియన్ వర్ధిల్లాలి— ఇంక్విలాబ్ జిందాబాద్— ఎమ్. డి. డౌన్ డౌన్).

లాయరు: మహాజనులారా! ఈ రోజు ఒక కుష్ఠు వాణ్ణి ఒక బాంకు ప్యూను తోశాడు. ఎందుకు తోశాడు? పై అధికారులు తొయ్యమనడం వల్ల తోశాడు. ప్యూను పీడిత ప్రజానీకానికి చెందినవాడు. ఇలాంటి పీడిత ప్రజకు రక్షణ కల్పించలేని మంత్రి వర్గం రాజీనామా చెయ్యాలి! (చేయాలి, చేయాలి అన్న కేకలు).

పీతాంబరం: ఇదంతా చూస్తూ ఉంటే నాకు మతి పోతూంది.


లాయరు: ఒక ఆరోగ్యకరమైన యువకుణ్ణి ఈ బాంక్ ఎలా చేసిందో చూడండి. (అనిల్ చేతులు ఎత్తి వేళ్ళు మడిచి గాలిలోకి చేతులు ఎత్తాడు) ఉద్యోగస్థుల రక్తం పీల్చే మానేజిమెంటు వెంటనే క్షమాపణ చెప్పుకోవాలి. అలా చెప్పకపోతే, ముఖ్యమంత్రి పదవి దిగాలి. ముఖ్యమంత్రి— (అందరూ డౌన్, డౌన్ అని అరుస్తారు).

పీతాంబరం: మీకేమైనా బుద్ధుందా—మా మానేజిమెంటేమిటి— ముఖ్యమంత్రేమిటి—రెండింటికీ సంబంధం ఉందా అసలు?

(అందరూ ''ఉయ్ వాంట్ జస్టిస్', అని అరుస్తారు. అలా అరచుకుంటూ ఎమ్. డి రూమ్‌లోకి వెళ్తారు.)

కుష్ఠువాడు: అందరూ కలసి నన్నొదిలేశారేమిటి?

పీతాంబరం: సమస్య దొరికితే చాలు. తమ స్వార్థానికి ఉపయోగించుకోవడం వాళ్ళకి తెలుసు.

Dattaram-RD 5

కుష్ఠువాడు: ఇంత జరుగుతుందని తెలిస్తే అయిదు రూపాయ లెయ్యకనే పోదును.

పీతాంబరం: ఇక్కడ సమస్య అయిదు రూపాయలు కాదు. వెయ్యడం, తీసుకోవడం- అదీ సమస్య. సేట్ చమన్‌లాల్‌కి ఆరవై లక్షలు కళ్ళు మూసుకుని ఇచ్చిన బాంకు, చెప్పులు కుట్టే వాడికి అయిదొందలు ఇవ్వడం లేదు. ఒక కుష్ఠు వాడి దగ్గర అయిదు రూపాయలు తీసుకోవడానికి ఇంత గొడవ చేస్తున్న బాంక్, అదే అయిదు లక్షలు —( అని ఆగి ) నీ పేరేమిటి? (లోపల్నుంచి "మానేజిమెంట్ జిందాబాద్" అని అరుస్తూ ముగ్గురూ వస్తారు. కుష్ఠు వాడు ఏం చెప్పాడో వినపడలేదు.) ఏమైంది? (ఒక కాగితం మీద వ్రాస్తూ అడిగాడు. )

ప్యూను : మేనేజిమెంట్ చెప్పినట్టు చేసినందుకు, కుష్ఠోడినైనా భయపడ కుండా అణ్ణె తీసినందుకు నాకు రెండు ఇంక్రిమెంట్లు ఇచ్చినారయ్యా!

అనిల్‌కుమార్ : పై ఆఫీసర్ ఆర్డర్ శిరసావహించి, కుష్ఠు అనైనా మాడకుండా వారి దగ్గర డిపాజిట్ తీసుకున్నందుకు నాకు ప్రమోషన్ ఇస్తున్నారు, సార్!

లాయరు : మిస్టర్ పీతాంబరం! (షేక్ హాండ్ ఇస్తూ) నేను బాంక్ సర్వీస్‌లో చేరుతున్నాను — అని చెప్పటానికి సంతోషిస్తున్నాను. వేర్ ఈజ్ మై సీట్? నా కుర్చీ ఎక్కడ?

పీతాంబరం : ఏమిటి?

అనిల్ కుమార్: మన లీగల్ ఎడ్వయిజర్ పోస్టు ఈయన కిచ్చారు, సార్.

పీతాంబరం : ఓహ్! కంగ్రాచ్యులేషన్స్!

లాయరు : చూశారా— మన ఎమ్. డి. గారు ఎంత అద్భుతంగా సమస్యని పరిష్కరించారో!

ప్యూను : మరందుకే కదయ్యా ఆయన ఎయిర్ — కండిషన్ రూమ్‌లో, మనం బయట గూసుంటం.

అనిల్‌కుమార్: అన్నట్టు మిమ్మల్ని కూడా రమ్మన్నారు, సార్, లోపలికి

పీతాంబరం : నన్నా! (అని వెళ్ళాడు )

లాయరు : ఇంక నీవు వెళ్ళిరావోయ్. ఇదిగో-నా కుద్యోగం ఇప్పించిన సందర్భంలో రూపాయి — ఉంచుకో.

కుష్ఠువాడు : నా అయిదు రూపాయలు —

అనిల్‌కుమార్ : ఇంకా అ దేమిటి. భారతంలో పాండవుల్ని కృష్ణు డొదిలేసినట్టు నిన్నాయన వదిలేస్తే.

కుష్ఠువాడు : వదిలేశాడా?

అనిల్‌కుమార్ : (దగ్గరికెళ్ళి ) ఆఁ— ఇక నీ అవసరం లేదు. వెళ్ళిరా.

కుష్ఠువాడు : వెళ్ళిరానా—

లాయరు : ఆఁ— థాంక్స్ — వెళ్ళిరా. ఇదిగో రూపా...

కుష్ఠువాడు : (కాలర్ పట్టుకొని గాలిలోకి లేపి) లంజ...! ఇంతవరకు నీ అవసరానికి వాడుకొని, ఇప్పుడు వెళ్ళి రమ్మంటావా — —

లాయరు : ( గాలిలో కెవ్వున అరచి, కిందపడి) లం ...జ ... కొ ... డ ... కా! డిఫర్మేషన్—డిఫర్మేషన్ సూట్ ఫర్ ఫిఫ్టీ థౌజండ్. యాభై వేలకి పరువు నష్టం దావా వేయకపోతే నా పేరు పంతులు కాదు.

అనిల్‌కుమార్ : అలా అనకూడదు, సార్. మీ రిప్పుడు బాధ్యతాయుతమైన బాంకు ఉద్యోగి.

కుష్ఠువాడు: నా అకౌంట్ గురించి చెప్పు.

ప్యూను: ఇంగ సెప్పేదేంది. నీ తరపున సంతకం పెట్టేటందుకు మనోళ్లేరు. ఎల్లెల్లు (అని టపా చింపుతూ ఉంటాడు.)

లాయరు : అదీ లీగల్ పాయింటు. సంతకం పెట్టలేని, తన తరపున సంతకం పెట్టటానికి ఎవర్నీ తెచ్చుకోలేని క్లయింటుని బాంకు తిరస్కరించవచ్చు.

అనిల్‌కుమార్ : అబ్బ! ఏం పాయింటు చెప్పారు, సార్. అందుకే ప్రతి బాంక్‌కి

70 ఏండ్లుగా
వాడుతున్న
వేసవి పానీయం

షర్బత్ రూహ్ అఫ్జా 70 సంవత్సరాలుగా ప్రజలకు వేసవి దినాలలో చల్లదనాన్ని, ఉపశమనాన్ని కలగజేస్తూనే ఉంది.

ఇది తాజాతనాన్ని చేకూర్చే వట్టి వేళ్ళు, కస్ కస్, కాస్నీ, పుదీనా, ధనియాలు, చుక్క కూర, గులాబీ, మంచి గంధం మొదలయిన 16 మూలికలతోను, కమలాఫలాలు, అనాస పండ్ల అసలైన రసంతోను తయారయింది.

షర్బత్ రూహ్ అఫ్జా దాహం తీర్చటమేకాదు, మీ శరీరానికి వేడిమి తట్టుకునే శక్తిని కూడా సమకూరుస్తుంది. మీరు దీనిని పంచదార బదులు, చల్లటి నీళ్ళు, మజ్జిగ, పాలల్లో లేదా ఐస్‌క్రీంలో కలుపుకుని తీసుకోండి, పరిపూర్ణ ఆనందాన్ని పొందండి.

Hamdard

షర్బత్
రూహ్ అఫ్జా
'సాటిలేనిది'

HTD-HWL-6741






ఒక లీగల్ అడ్వైజర్ అవసరం ఉంటుంది.

లాయరు : ది అడ్వయిజర్ షుడ్ టాకిల్ ది ప్రాబ్లమ్స్ యు నో. ఫార్ ఎ లెప్పర్ హో బడీ టేక్స్ ది పెయిన్ ఆఫ్ సైనింగ్ ది డిపాజిట్ ఓచర్. ఆఫ్ దట్ ప్లీ ఉయ్ ఆర్ రిజెక్టింగ్ హిమ్.

అనిల్‌కుమార్ : యువర్ బ్రెయిన్ ఈజ్, రియల్లీ ఎ మాస్టర్ బ్రెయిన్, సార్.

కుష్ఠువాడు : బట్ ఐ కాన్ సైన్ ది ఓచర్ మై సెల్ఫ్ యు నో!

ఇద్దరూ : ఏమిటీ—

కుష్ఠువాడు : ఐ హావ్ స్టడీడ్ అప్ టు టెన్త్ క్లాస్ అండ్ ది డిసీజ్ ప్రివెంటెడ్ మై స్టడీస్ అండ్ మేడ్ మి ఎ బెగ్గర్.

అనిల్‌కుమార్ : మళ్ళీ సమస్య మొదటి కొచ్చిందిరో, దేముడో. వీడికి ఇంగ్లీషు కూడా వచ్చున్నోయ్.

ప్యూను : ( కవరు పట్టుకొని లేచి) రాజేంద్రప్రసాద్, కేరాఫ్ బాంక్ ఆఫ్ ఉటోపియా — ఎవరీయన?

కుష్ఠువాడు : అది నా పేరే ...

ప్యూను : (ఉత్తరం లాయరు కిస్తూ) బాంక్ ముందు అడుక్కునేటోళ్ళందరూ కేరాఫ్ బాంక్ అని రాసే దానికి ఇదేం పోస్టాఫీ సనుకున్నావు.

లాయరు : (చదువుతూ) యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్. ఇదేమిటి ఫారిన్ నుంచి వీడికి ఉత్తరం వచ్చింది?

ప్యూను: ఫారిన్ నుంచానయ్యా.

అనిల్‌కుమార్ : ( లాయరు భుజం మీద నుంచి చదివి) భారతదేశంలో కుష్ఠు నివారణ చర్యలకై ఐక్యరాజ్య సమితి ఒక ట్రస్టు ఏర్పాటు చేసినది. దానికి 60 లక్షలు గ్రాంటు. దానికి ట్రస్టీ రాజేంద్రప్రసాద్. అంటే, మన కుష్ఠువాడు.

లాయరు : ఈ లెప్పర్ — (చేతిలో కాగితం జారిపోయింది. )

ప్యూను : అరవై లక్షలకి ట్రస్టీ.

అనిల్‌కుమార్ : అసలు నమ్మ శక్యంగా లేదు.

లాయరు : కుష్ఠువాళ్ళ ట్రస్ట్‌కి కుష్ఠువాడు అధికారి అయితే జాగ్రత్తగా చూసుకుంటాడని వాళ్ళనుకొని ఉంటారు.

ప్యూను : అందులోనూ చదువుకున్న కుష్ఠోడాయె!

అనిల్‌కుమార్ : ఇండియాలో చదువుకున్న కుష్ఠువాడు ఎవడా అని అక్కడ నుంచే ఎంక్వయిరీ చేశారంటే నిజంగా అమెరికా వాళ్ళు తెలివైన వాళ్ళు. అరెరె! వెళ్ళకండి, సార్. ఇలా రండి.

లాయరు: వెళ్ళిపోతున్నారా. భలేవారే. రండి, కూర్చోండి.

కుష్ఠువాడు : నేనా?

లాయరు : మీరే. ఇలా కూర్చోండి. (అని షేక్‌హాండ్ ఇస్తాడు. కుష్ఠువాడు తన చేతిని అనుమానంగా చూసుకొని షేక్ హాండ్ ఇస్తాడు.) కంగ్రాచ్యులేషన్స్.

ప్యూను : మూడు బాటిల్స్ లిమ్కా తెద్దునా?

లాయరు : ఏమిటి, సార్— లిమ్కానా ఫ్రూట్ జ్యూసా (అని అడిగాడు.)

కుష్ఠువాడు: నాకేం ఒద్దు.

లాయరు : కొంచెం చల్లటి మంచినీ ళ్ళిమ్మంటారా?

కుష్ఠువాడు : మీ రీ గౌరవాన్ని నా కెందుకు చేస్తున్నారో అర్థం కావటంలేదు.

అనిల్‌కుమార్ : అదేమిటి, సార్. అరవై లక్షలు డిపాజిట్ వేస్తే మా బ్రాంచి స్టేటస్ అమాంతంగా పెరిగిపోతుంది.

ప్యూను : మా లాయరుగారికి ప్రమోషను వస్తది.

కుష్ఠువాడు : అరవై లక్షలేమిటి?

అనిల్‌కుమార్: డిపాజిట్, సార్. ఇప్పుడు మీరు ట్రస్టీలు. ఆ అరవై లక్షలూ మీ రేం చెయ్యాలనుకుంటే అది చెయ్యొచ్చు.

కుష్ఠువాడు : అయిదయిదు రూపాయల్తో పన్నెండు లక్షల మంది కుష్ఠోళ్ళ అకౌంటులు మీ బాంక్‌లో ఓపెన్ చేయించనా!

లాయరు : అమోఘం. నిజంగా డబ్బుతోపాటు ప్రజాస్వామ్య లక్షణాలు కూడా మీ కున్నాయంటే మీరు నిజంగా గ్రేట్.

అనిల్‌కుమార్ : అమెరికా వాళ్ళు సామాన్యులు కాదు, సార్. ఎక్కడ పెట్టుబడి

పెట్టాలో వాళ్ళకి బాగా తెలుసు.

కుష్ఠువాడు: మీ రింత మూర్ఖులని తెలిసే ఆయన మిమ్మల్ని ఇలా ఆట పట్టించారు. నా పేరడిగి ఆ కాగితం మీద రాశారు. అదేదో గ్రాంటనుకుని మీరు నాకు హారతులు పడుతున్నారు. లేకపోతే నా కేమిటి, అమెరికా నుంచి అరవై లక్షలు రావడ మేమిటి? మీ రెలా నమ్మే రిదంతా?

అనిల్‌కుమార్: అరవై లక్షలు రాలేదా? అంతా మోసమా?

లాయరు: ( కెవ్వున అరచి ) షేక్‌హాండ్ తీసుకున్నానే నా చెయ్యి—

ప్యూను: ఈన్కి లిమ్కా కావాలా. గదినే తేవాల్నా నీ యవ్వ—నిన్ను—(అని కర్ర ఎత్తుతాడు ).

కుష్ఠువాడు: ఆగు. ఆ కర్ర నా ఒంటి మీద పడిన మరుక్షణం అది నీ ఒంటి మీద విరుగుతుంది. ఇందులో నా తప్పేంలేదు. తప్పంతా మీది. అయిదు రూపాయలు తీసుకోవటానికి యాభై లీగల్ పాయింట్లు చెప్పిన మీరు అరవై లక్షలనేసరికి నే తాగిన గ్లాసులో నీళ్ళు తాగటానికికూడా సిద్ధపడ్డారు.

లాయరు: నాన్సెన్స్! గెటౌట్. వాణ్ణి పంపించు.

కుష్ఠువాడు: అక్కర్లేదు. నేనే వెళతాను. బయట కూర్చుని అడుక్కుంటున్న నాకు ఈ బాంకు ఒక రాజభవనంలా, మీ రంతా దేవతలుగా కనిపించే వాళ్ళు. మీ ప్రపంచం లోకి రావాలని పైసా పైసా పోగుచేసుకున్నాను. లోపలికి వచ్చి చూస్తే ఏముందీ నాకు కాదు కుష్ఠు. మీ రంతా డబ్బు కుష్ఠుతో బాధ పడుతున్నారు. కుష్ఠుతో. కుళ్ళిపోతున్నారు.

లాయరు: ఇలా మోసం చేసినందుకు చీటింగ్ కేసు కింద నిన్ను.

కుష్ఠువాడు: నోరు ముయ్యరా, బాడ్‌ఖావ్.

అనిల్‌కుమార్: నోరు మూసుకుని వాణ్ణి పంపించేద్దాం, సార్. లేకపోతే వాడే కుష్ఠుచేత్తో మన నోరు మూసేట్టు ఉన్నాడు.

లాయరు: ఆప లిదంతా చేసినందుకు ఎమ్ డి. గారితో చెప్పి పీతాంబరాన్ని ( అని తిరిగేసరికి గుమ్మంలో పీతాంబరం ఉంటాడు. చేతిలో కాగితం ఉంటుంది. )

పీతాంబరం: పీతాంబరం ఓడిపోయాడు.

చమన్‌లాల్‌కి అరవై లక్షలు రికమెండ్ చెయ్యనందుకు ఎక్స్‌ప్లనేషన్ అడిగారు. ఆస్తుల్లేని వాళ్ళకు అప్పు లిచ్చినందుకు మెమో ఇచ్చారు. బాంక్ ప్రెస్టేజికి పరోక్ష కారణం అయినందుకు ఇంక్రిమెంట్లు ఆపు చేశారు. గొడవ జరిగింది. ఆత్మవంచనకుఆత్మాభిమానానికి జరిగిన ఘర్షణలో ఆత్మాభిమానమే గెలిచింది. నేను రాజీనామా ఇచ్చేశాను.

అనిల్‌కుమార్: రాజీనామా చేశారా.

ప్యూను: ఇప్పు డేం చేస్తావయ్యా మల్ల?

పీతాంబరం: ఏం చేస్తాను? అపునేం చేస్తాను. ( బిగ్గరగా నవ్వి ) అడుక్కుతింటాను. ఈ బాంకెదురుగానే పుట్‌పాత్ మీద కూర్చుని అడుక్కుతింటాను. అంతేకానీ అంతేకానీ—ఈ కుష్ఠు వ్యవస్థమోచేతి నీళ్ళు తాగను.

కుష్ఠువాడు: ( లాయర్ని హఠాత్తుగా పట్టుకుని ) దీనంతటికీ కారణం ఈడే—బాబయ్యా, ఈడే.

లాయరు: ( గింజుకుంటూ ) వదులు, వదులు. ( విడిపించుకుని ) ఇదిగో. అనిల్‌కుమార్, ఈ కుష్టోడు తన కున్న కుష్ఠుతో జనాన్ని బెదిరిస్తున్నాడని, ముట్టుకుంటున్నాడనీ పోలీసులకి ఫోన్ చెయ్యి. వచ్చి న్యూసెన్సు కేసు కింద బుక్ చెయ్యమను.

అనిల్‌కుమార్: మీది అమోఘమైన ఐడియా సార్. దీంతో మన కుష్ఠు సమస్యకూడా తీరిపోతుంది.

పీతాంబరం: ఇది అన్యాయం.

లాయరు: న్యాయా న్యాయాలు న్యాయస్థానం విచారిస్తుంది. నా కిద్దరు సాక్షులున్నారు. వాడికి నువ్వొక్కడివే సాక్షివి.

పీతాంబరం: ఈ వ్యవస్థలో న్యాయం—( అని మోచోడు రావడం చూసి ఆగి పోయాడు. )

మోచోడు: ( రెండు చేతులలోనూ ముంత పట్టుకుని వచ్చాడు. ) తెచ్చినాను, బాబూ. అప్పు తీర్చడానికి పైసలు తెచ్చినాను. ఎంతున్నాయో సూడు. నీకు మాట రాకూడదనీ, నా మీదుంచిన నమ్మకం పోకూడదనీ, కడుపు మాడ్చుకుని, కళ్ళలో వత్తులు వేసుకుని కుట్టినాను, బాబూ, సెప్పులు. ఇంకయిపోయింది. ఇవే, ఇవే పైసలు జమ వేసుకో నీ అప్పుకి ఇంక రావు. ఇంక నేను కుట్టలేను—బాబూ, సెప్పులు. సెర్మం ధర రెండింతలయింది. అయినా, పర్లేదనుకున్నా, బాబూ. కానీ, కానీ, నా కొడుకు నన్నిడిసి ఎల్లి పోయినాడు. సెప్పులు కుట్టేపని వద్దని సమన్‌లాల్ కాళ్ళకి సెప్పులు తొడిగే పనిలో కుదురుకున్నాడు, బాబూ. అయినా, అయినా నే బెదర్లే బాబూ. నీ అప్పు దీర్చాలని పైస పైస కూడబెట్టినా. సేతుల్లో బలం సెమటై సెప్పుల్లోకి జారే వరకూ కుట్టినా బాబూ. గేరంటీ ఇచ్చిన కొడుకు ఎల్లి పోయిండని నా పాక ఏలం ఎయ్యకండయ్యా. ఇదిగో—పైసలివిగో.

( అంటూ అది పగల గొట్టేసరికి డబ్బు స్టేజీ అంతా చిందింది. )

పైసల్లెక్క పెట్టుకోండి, బాబూ, మీ పైసలు.

( అంటూ పడిపోయాడు )

అనిల్‌కుమార్: ( వస్తూ ) పోలీస్ వాన్ బయలుదేరింది సార్. రెండు నిమిషాల్లో వస్తుం. . . ( అని ఆగి పోయాడు. ) ఎవడు వీడు? బాంక్‌లో బకెట్ తన్నేసేడు?

పీతాంబరం: డబ్బున్న వాడికీ, డబ్బు లేనివాడికీ మధ్య జరిగిన ముష్టి యుద్ధంలో ఓడిపోయిన వాడు. కుష్ఠూ! ( అరిచాడు ) చూశావుగా ఈ యుద్ధాన్ని డబ్బున్న వాడి ఆయుధాన్ని. ఎంత తెలివిగా ఆ ఆయుధంతో వాణ్ణి ( మోచోణ్ణి చూపించి ) నిరాయుధుణ్ణి చేసి చంపారో! చర్మం ధర పెంచేసి వీడి భూమి ప్రభుత్వం లాక్కుంది. సూటూ, బూటూ, టై, ఆశ పెట్టి వీడి లేబర్ కొడుకుని కాపిటలిస్ట్ లాక్కున్నాడు. వీడి కాపిటల్‌ని ( నాణాలు ఎత్తి పోస్తూ ) బాంకు లాక్కుంది. వీడు మిగిలాడు. నిస్సత్తువైన నరాల్తో శవంగా మిగిలి పోయాడు.

అనిల్‌కుమార్: అదిగో—వాన్ వస్తూంది.



– ఎమ్. శివశంకరయ్య

పీతాంబరం: వాన్ వస్తూంది. కుష్ఠూ—ఒకే నిమిషం—నీ పగ తీర్చుకోవడానికి ఒకే ఒక నిమిషం. యూనియన్ పేరు మీద తన పబ్బం గడుపు కుంటున్న వర్కర్ మీద తీర్చుకుంటానో, పని చెయ్యకుండా కబుర్లు చెప్పే యువతరం మీద తీర్చుకుంటావో, డబ్బున్న వాడి కోసం డబ్బు లేని వాడిని ఉపయోగించుకునే స్వార్థపరుడి మీద తీర్చుకుంటావో వెళ్ళు. ఒకే నిమిషం ( కుష్ఠు బాంక్ లోకి వెళ్ళగానే పెద్ద శబ్దం మొదలవుతుంది. మొత్తం బల్లల్నీ కుర్చీల్నీ, ధ్వంసం చేస్తాడు. తిరిగి వస్తాడు. ప్రయోక్త ప్రేక్షకుల వైపు తిరిగి ఉంటాడు ).

ప్రయోక్త: ఎవరి మీద కసి తీర్చుకున్నావ్? లాయరు మీదా? అనిల్ మీదా? ప్యూన్ మీదా?

కుష్ఠువాడు: వ్యక్తుల్లో స్వార్థం పెరగడానికి వ్యవస్థే కారణం, వ్యవస్థ మారితే వ్యక్తి మారుతాడు. అందుకే దొరికిన ఒక నిమిషంలో వ్యవస్థ ఒక స్తంభాన్ని కూలగొట్టాను. ప్రవాహంలా డబ్బుని, డబ్బున్న వాడి గోదాముల్లోకి పంపిస్తున్న బాంక్‌ని సర్వ నాశనం చేశాను. పుట్‌పాత్ మీద కూర్చుని నేను కలలు గన్న రాజభవనాన్ని సమూలంగా సర్వ నాశనం చేశాను.

ప్రయోక్త: పోలీసు లొస్తున్నారు.

కుష్ఠువాడు: అవును. ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి పోలీసు లొస్తున్నారు. ( రిపీట్ ) బ్యాంక్‌ని రక్షించడానికి పోలీసు లొస్తున్నారు. కాపిటలిస్ట్ ఆయుధాన్ని రక్షించడానికి ఆయుధాలతో పోలీసు లొస్తున్నారు. *

( తెర )

( ఒక మూస పత్రిక కథ ఆధారంగా వ్రాయబడ్డ నాటిక. )